# సాక్షి
## మానవ హక్కుల నిఘా

NEWSLETTER - 19 BI MONTHLY FOR PRIVATE CIRCULATION ONLY JUNE- JULY : 2008



# హక్కులూ - చట్టాలు

...✍ - వి. నందగోపాల్

హక్కుల కోసం పోరాటం చేసేటప్పుడు ప్రతి ఒక్కరిలోనూ ఆశలు చిగురిస్తాయ్. మనం సాధించుకోబోయే హక్కులు మన జీవితాలను మారుస్తాయని హక్కులను పూర్తిగా అనుభవించాలంటే వాటిని రక్షించే చట్టాలు కావాలి. ఆ చట్టాలు సక్రమంగానూ నిష్పక్షపాతంగాను అమలుపరచబడాలి. అప్పడే మనకు మన హక్కుల పట్ల నమ్మకం ఏర్పడుతుంది. చట్టాలిచ్చే భరోసా పట్ల విశ్వాసం కలుగుతుంది. మనపట్ల మనకు ధైర్యం పెరుగుతుంది. కాని కుల దొంతరలలో కూరుకుపోయిన మన సమాజంలో చట్టాల అమలు ఈ ప్రభావాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా జరుగుతుందా? అది సాధ్యమా? అయితే నాటికీ, నేటికీ దళితుల పట్ల అంటరానితనం నిరంతరం నిరాటకంగా ఎందుకు కొనసాగుతుంది? నేటికీ భారతదేశం మొత్తం మీద అమానవీయమైన మలమూత్రాల ఎత్తిపోతల పనిలో 13లక్షల మంది మగ్గిపోతున్నారు. వీరిలో 90శాతం మంది దళితులే ఉండడానికి కారణాలేమిటి?

ప్రపంచ మేధావి డా॥ బాబాసాహెబ్‌గారి అపార జ్ఞాన సంపద వలన, భారతీయ సమాజంపై వారు చేసిన లోతైన పరిశోధనల వలన, దళితులు, బలహీనవర్గాలు, అణగద్రొక్కబడిన జాతుల భవిష్య సంక్షేమం కొరకు ఎన్నో హక్కులను భారత రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది.

ఆర్టికల్ 17ద్వారా ఈ దేశంలో అంటరానితనం 60సం॥రాల క్రితమే నిర్మూలించబడింది. తద్వారా సంక్రమించిన హక్కులను కాపాడడానికి, అంటరానితనం (నేరాలు) చట్టం 1955గా వచ్చింది. దీని అమలుపట్ల అసంతృప్తితో లోటుపాట్లను సరిదిద్ది అదే చట్టాన్ని సవరణలతో 1976లో పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955 తీసుకొని రావడం జరిగింది. అయినా అంటరానితనం సమిసి పోయిందీ లేదు, తద్వారా సంక్రమించిన హక్కులను దళితులు అనుభవించిందీ లేదు. హక్కుల వుల్లంఘనలు, భౌతికదాడులు, మానసిక హింసలు దళితులపై కొనసాగుతూనే వున్నాయి. ఎన్నో జీవితాలు బలై పోగా 1989లో ఎస్.సి, ఎస్‌టిలపై అత్యాచారాల నిరోధకచట్టం 1989 వచ్చింది. దళితులకు గిరిజనులకు తమ హక్కుల రక్షణ పట్ల రవ్వంత ఆశను కలిగించింది. అయితే ఈ చట్టం అమలుకు కావలసిన నియమ నిబంధనలు రావడానికి మరో 6 సం॥రాలు పట్టింది.

ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల (నిరోధక) నియమావళి,1995 గా ఈ చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలు వచ్చాయి. భారతీయ శిక్షాస్మృతి చట్టం నేరానికి గాను నిందితునికి శిక్షను మాత్రమే చెపుతుంది. అయితే ఈ చట్టంలో నిందితునికి శిక్షతో పాటు బాధితులకు, బాధితులపై ఆధారపడిన కుటుంబసభ్యులకు జరిగిన నష్టాన్ని ఎలా పూరించాలో కూడా చెపుతుంది. ఈ చట్టం తయారి వెనుక వున్న మేధావుల అంకితభావం, సమగ్ర దృక్పథం ఎంతైనా హర్షణీయం.

అయితే వాస్తవంగా వీటి అమలు పట్ల బాధితులకు అందుతున్న న్యాయం పట్ల, నిందితులకు పడే శిక్షల పట్ల, వస్తున్న ఫలితాల క్రమం, బాధితులలో ఏమాత్రం విశ్వాసం పెంచడం లేదన్నది వాస్తవం. ఇందుకు కారణాలనేకం. అయితే హర్షించలేని అంశం ఈ చట్టాన్ని అమలుపరచవలసిన పోలీస్ అధికారులు గాని, న్యాయమూర్తులు గాని కులదొంతరల దృక్పథ భావాల నుండి అతీతంగా, నిష్పక్షపాత మానవ దృక్పథంతో తమ బాధ్యతను నిర్వర్తించలేకపోవడం.

దీనిని అధిగమించాలంటే బాధితులు, దళిత నాయకులు, బాధితులకు అండగా నిలిచే కార్యకర్తలు ఈ చట్టాన్ని గురించి మరింతగా లోతుగా తెలుసుకోవాలి. అమలులో జరుగుతున్న లోటుపాట్లను పట్టుకోవాలి. వాటిని ప్రశ్నించాలి, ఇంకోసారి ఇలా జరగకుండా చూసుకోవాలి. తప్పదు ఇదొక నిరంతర సాధన. ఇందులో మన ఈ 'సాక్షి నిఘా' పత్రిక రవ్వంత తోడ్పాటును అందజేయగలుగుతుందని ఆశిస్తూ ....

ఇట్లు
**సాక్షి**

## దళిత్ కాల్ లైన్

నేటి సమాజంలో కులవ్యవస్థ వేళ్ళు పాతుకొని పోయిన సందర్భంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలు అనేక హింసలకు గురౌతున్నారు. కుల అకృత్యాలకు సాక్షులుగా ప్రత్యేకించి దళితులు, గిరిజనులు అందులోనూ స్త్రీలు మిగులుతున్నారు. అలాంటి ఘోరమైన పరిస్థితి హైటెక్ నగరమైన హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుండి ఒంగోలు వెంగముక్కల పాలెం వరకు అనేక ఘటనలు మనముందుకు వస్తున్నాయి. రాష్ట్రమంతటా ఇలాంటి పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాక్షి మానవహక్కుల నిఘా తన బాధ్యతల్ని తాను నిర్వర్తించుకుంటూ ముందుకు వెళుతుంది. ఆ క్రమంలో ఉన్న సమాచార వ్యవస్థని మరింత విస్తృతం చేసుకోవాల్సిన అవసరం వుంది.

కావున గ్రామాల్లో వివిధ ఉద్యమాల్లో ప్రజోపయోగ కార్యక్రమాల్లో పాల్గొంటున్న సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జరిగిన **"రేప్, మర్డర్, సాంఘిక బహిష్కరణ, సామూహిక దాడులు, ఆస్తుల విధ్వంసం, లాకప్‌మరణాలు** మొదలైన వాటి వివరాలను టోల్ ఫ్రీ నెంబర్ - 18004255535, 27737093కు తెలియజేయ వలసిందిగా కోరడమైనది.

ఇట్లు
సాక్షి మానవహక్కుల నిఘా

# రిజర్వేషన్లలో న్యాయం ఎవరికి?

...✍ - మహమ్మద్ ఇమ్రాన్ అలి
MSW విద్యార్థి, నిశ్వాస్ ఇనిస్టిట్యూట్, ఒరిస్సా

భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో అధికరణ 38 ప్రభుత్వము ప్రజల యొక్క సంక్షేమాన్ని పరిరక్షించాలని, సాంఘిక, ఆర్థిక, రాజకీయ మరియు న్యాయపరిరక్షణను పెంపొందించి, సాంఘిక వ్యవస్థను పటిష్టం చేయాలని వివరిస్తుంది. ప్రధానంగా సాంఘిక అసమానతలను తొలగించి, సమాన వసతులు, అవకాశాలు మరియు ప్రాతినిధ్యం వ్యక్తుల మధ్యనే కాక, వివిధ వర్గాల ప్రజలు నివసించే ప్రదేశాలలో కూడా పెంపొందించాలి, అనేటువంటి ఉద్దేశంతో మనం రిజర్వేషన్లు అనే పద్ధతి దత్తత తీసుకున్నాము. భారత రాజ్యాంగంలోని అధికరణలు 14,15,16 సమానత్వం, వివక్షతా నిర్మూలన, సమాన అవకాశాలు మరియు సమాన ప్రాతినిధ్యం వివరిస్తున్నాయి. రిజర్వేషన్ల గురించి భిన్నాభిప్రాయాలు మనకు ఉన్నాయి. అధికరణ 14 గురించి మాట్లాడితే ఒకవేళ అందరూ సమానం అన్నపుడు కొన్ని వర్గాలకు రిజర్వేషన్లు ఎందుకు? ఇక్కడ మమతానాయక్ గురించి ఒక గాధ వివరించాలి. ఒరిస్సా రాష్ట్రంలో పాఠశాలకు వెళ్ళే బాలిక మమతానాయక్ ఆమె ప్రతిరోజు సైకిల్ మీద పాఠశాలకు వెళ్ళేది. దళిత ఎస్సీ కులానికి చెందిన మమతను దళితురాలనే కారణంతో ఆ గ్రామస్తులు ఆమెను సైకిల్‌పై పాఠశాలకు వెళ్ళనివ్వలేదు. ఎన్నో పోరాటాల తర్వాత ఆమెను సైకిల్‌పై వెళ్ళడానికి అనుమతినిచ్చారు. ఇటువంటి సంఘటనలు మనదేశంలో ఎన్నో జరుగుతున్నాయి. సముద్రంలో ఒక బొట్టు మాత్రమే ఈ సంఘటన. అణగారిన వర్గాల ప్రాతినిధ్యం మరియు భాగస్వామ్యం రాజకీయంగా, ఆర్థికంగా, విద్యారంగంలోమరియు వివిధ ఇతర సాంఘికరంగాలలో చాలా స్వల్పం అని మనం విస్మరించరాదు.

| కులాలు / వర్గాలు | జనాభా శాతం | రాజకీయ ప్రాతినిధ్యం | విద్యా శాతం | ఉద్యోగాలలో ఉన్నవారి శాతం | వ్యాపారంలో ఉన్నవారి శాతం | భూమి కలిగి ఉన్నవారి శాతం |
|---|---|---|---|---|---|---|
| బ్రాహ్మణులు | 3.5% | 41% | 50% | 62% | 10% | 5% |
| క్షత్రియులు | 5.5% | 15% | 16% | 12% | 27% | 80% |
| వైశ్యులు | 6.1% | 10.5% | 12% | 13% | 60% | 9% |
| వెనుకబడిన తరగతులు | 52% | 8.1% | 12% | 7% | 0.8% | 4% |
| దళితులు | 15% | 15% | 6% | 4% | 0.1% | 0.5% |
| గిరిజనులు | 7.5% | 7.5% | 2% | 1% | 0.1% | 0.5% |
| మైనారిటీలు | 10.5% | 3.1% | 2% | 1% | 2% | 1% |
| మొత్తం | 100% | 100% | 100% | 100% | 100% | 100% |

(1991 భారతీయ జనాభా లెక్కల ఆధారంగా)

పైన పట్టిక చూసినట్లైతే కొన్ని వర్గాలు మాత్రమే ఎక్కువ అవకాశాలను పొందడం చూస్తున్నాము.

మన సమాజంలో రెండు రకాలైనటువంటి రాజ్యాంగాలను మనం చూస్తున్నాము. ఒకటి ప్రాచీనమైనటువంటి మనుస్మృతి ప్రజల ఆలోచనా విధానాలను పరిపాలిస్తున్నటు వంటిది. రెండవది భారతీయ రాజ్యాంగం కులపేరుతో ఎన్నో విధాలుగా ఉల్లంఘనలకు గురైనటు వంటిది. అగ్రవర్ణాలని పిలువబడే వర్గాలు భారత రాజ్యాంగాన్ని అంతర్గతంగా వ్యతిరేకిస్తూనే, రాజ్యాంగం యొక్క సమానత్వ ఉద్దేశాలను, భావాలను బహిరంగంగా అంగీకరిస్తురిస్తున్నారు. అయినప్పటికీ, అణగారిన వర్గాలపై వివక్షతను చూపుతున్న మనుస్మృతికే వారు అండగా ఉంటున్నారు.

పాఠశాలలో అంటరానితనం పాటించడం వలన మధ్యలోనే చదువు మానివేస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. సాధారణ వర్గాల కంటే నిరక్షరాస్యత మరియు చదువు మానేసిన పిల్లల సంఖ్య దళితులలోనే ఎక్కువవుతుండడంతో దళితులకు, దళితేతరులకు మధ్య అక్షరాస్యత వ్యత్యాసం వస్తుంది. దళిత మహిళల అక్షరాస్యత 37.8 శాతం గ్రామీణ భారతదేశంలో ఉంది. ఉపాధ్యాయులే పాఠశాలల్లో అంటరానితనం పాటిస్తూ, అంతర్గతంగా కుల వివక్షతను సమాజంలో పాటిస్తున్నారు. కులవ్యవస్థ, నిరక్షరాస్యత, బడి మానుకోవడానికి దోహదపడుతుందని, ఆ కారణంగానే బాలకార్మికులుగా జాతీయ గ్రామీణ ప్రాంతాల వారిలో 85శాతం బలహీన వర్గాల నుండి వస్తున్నారని సిడిఆర్‌డి 2006 తన నివేదికలో పేర్కొంది.

60 సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలో ప్రజల భావజాలంలో మార్పు రాలేదు. పార్లమెంటులో ఎస్సీ / ఎస్టీల ప్రాతినిధ్యం రిజర్వేషన్ కోటాలో కూడా ఇంకా సీట్లు మిగిలిపోతున్నాయి. మనం ప్రపంచీకరణకై ప్రయత్నిస్తున్నాము కానీ, మానవ సంబంధాలు, గౌరవంలో జాతీయాకరణ గురించి ఆలోచించడం లేదు. ఎస్సీ /ఎస్టీ లకు ఉన్న కొద్దిపాటి రిజర్వేషన్లు కూడా ఒక్కొక్కసారి వారిపైనే హింసకు కారణమవుతున్నాయి.

కొందరు రిజర్వేషన్ పద్ధతినే ఆపేయాలనీ, లేదా మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలని అంటున్నారు కానీ,దేవాలయాలలో ముఖ్య పూజారి వృత్తికిరిజర్వేషన్ గురించి మాట్లాడరు. రిజర్వేషన్ అనేది సమానత్వానికి ముగింపు కాదుకానీ, ఒక పరిష్కార మార్గం మాత్రమే. ఈ రిజర్వేషన్లు కూడా అందరూ పొందడం లేదు కానీ, తరాల వెంబడి తరాలు ఆర్థికంగానూ, సామాజికంగా అభివృద్ధి పొందినవారు మాత్రమే అందుకుంటున్నారు.

పాకీ కులంలో పుట్టిన వ్యక్తి మంత్రిగా అన్ని వసతులు పొందుతూ, సంతోషకరమైన జీవితం అనుభవిస్తూ, తన వర్గానికి చెందిన వ్యక్తికి తన ఇంటిలోని మరుగుదొడ్లు కడిగే అవకాశం కూడా ఇవ్వడు. ఎందుకంటే వారి మరుగుదొడ్లు, యంత్రాలతో కడుగబడతాయి. కాబట్టి ఆర్థికంగా సాంఘికంగా, రాజకీయంగా ఎదిగినవారు. పేదలైనటువంటి తమ వారి గురించి మాట్లాడానికి ముందుకు రావడం లేదు. అంతేకాకుండా "పెప్సీ", "కొకాకోలా" లాగా "ఎస్సీ, ఎస్టీ" అనేది ఒక బ్రాండ్ నేమ్‌గా పెట్టుకుని దాని ఫలాలు అనుభవిస్తున్న ప్రభుద్దులూ ఉన్నారు. అలా వారి పేరు ప్రఖ్యాతుల కోసం ఎస్సీ, ఎస్టీలుగా చలామణీ అవుతున్నారు అదే కనుక కొనసాగితే ప్రజాస్వామ్యం అనేది ప్రజల వలన, ప్రజల చేత, ప్రజల కొరకు అనే అర్థం మారి ప్రజల యొక్క ప్రాతినిధ్యం లేకుండా, ప్రజలను పట్టించుకోని విధానం ఈ ప్రజాస్వామ్యం అన్నట్లుగా వుంది. ●

# దళితులకు అత్యాచార నిరోధక చట్టం యొక్క ఫలాలు అందేనా?

...✍ - కె. ప్రసన్న, కోఆర్డినేటర్, సాక్షి

అత్యాచారాల వ్యతిరేక చట్టం ప్రకారం ఒక వ్యక్తి దళితుడు/ దళితురాలు అని తెలిసి కూడా వారిపై అత్యాచారం చేసిన యెడల షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం 1989 ప్రకారం వారిని శిక్షించాలి మరియు బాధితులకు న్యాయం జరిగేలా పునరావాస చర్యలు చేపట్టి, వారికి మానసికంగా, ఆర్థికంగా మరియు సామాజికంగా చేయుతనిచ్చి, వారిని జన జీవన స్రవంతిలో కలిసే విధంగా ప్రోత్సహించాలి. కానీ, వాస్తవంగా ఏమి జరుగుతుంది అనేది అవగాహన కావడానికి ది.17.04.08న ఎస్సీ/ ఎస్టీ చట్ట ప్రకారంగా ఏర్పాటు చేయబడిన ప్రత్యేక సెషన్స్ కోర్టు, మచిలీపట్నం. న్యాయమూర్తి శ్రీ.టి.గంగిరెడ్డిగారు కేసు.నెం.స్పెషల్ ఎస్.పి.నెం. 13/2007లో ఇచ్చిన తీర్పు సారాంశం మనం గమనించాలి.

**సంఘటన పూర్వోపరాలు :** ఈ కేసులో బాధితురాలు అయిన మొదటి సాక్షి, ఆమె కుమార్తె అయిన రెండవ సాక్షి (12 సం॥లు) ఎస్.సి. మాదిగ కులమునకు చెందినవారు. మొదటి సాక్షికి, ప్రథమ నిందితునికి 7 నెలల నుండి వివాహేతర సంబంధం ఉండడంతో అతని వాహనంలోనే తన పుట్టినింటికి తన కుమార్తెను తీసుకుని బయలుదేరినది. అలా బయలుదేరిన వారిని నిందితుడు దారి మళ్ళించి, వారిని పామర్రు గ్రామానికి తీసుకువెళ్ళి, ఒక ఇంటిలో అద్దెకు ఉంచి, ఆమెతో వివాహేతర సంబంధాన్ని నెరిపినాడు. అంతటితో ఆగకుండా ది. 7-12-05 నాడు ప్రధాననిందితుడు రాత్రి 10 గంటలకు తన ముగ్గురు మిత్రులను తీసుకువచ్చి వారితో వ్యభిచారం చేయమని బాధితురాలిని అడుగగా, అందుకు నిరాకరించి, వారిని నిందించిన బాధితురాలిని తమ కోరిక తీర్చకపోతే ఆమె కుమార్తెను చంపుతామని బెదిరించారు. అయినా కూడా అంగీకరించని బాధితురాలిపై బలవంతంగా ఒకరి తరువాత ఒకరు అత్యాచారం చేశారు. ఆ సమయంలో ప్రధాన నిందితుడు బాధితురాలి కుమార్తెను పట్టుకుని ఆగదిలోనే ఉన్నాడు. అంతేకాకుండా నాల్గవ ముద్దాయి, బాధితురాలికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి, ఆమె శరీర భాగాలను బ్లేడుతో కోసి, అధిక రక్తస్రావానికి కారకులైనారు. ఈ గొడవ గమనించిన ఇంటి యజమాని యొక్క బంధువులు సంఘటన గురించి అడిగినారు. అంతేకాకుండా ది. 8.12.07న వారిని ఇల్లు ఖాళీ చేయమని అడుగగా నిందితుడు, బాధితురాలినీ, ఆమె కుమార్తెను కొత్త పెదమద్దాలి గ్రామం, కొత్తూరులోని వేరొక ఇంటిలో ఉంచినాడు. బాధితురాలు తమని విడచిపెట్టమని మొదటి ముద్దాయిని బతిమాలగా, ఆమె తలపై రోకలిబండతో మోది గాయపరచినాడు. మరలా తమని వదలివేయవలసిందిగా బతిమాలిన బాధితురాలిని మొదటి ముద్దాయి ఇనుప వస్తువు కాల్చి ఆమె శరీరంపై వాతలు పెట్టి గాయపరచినాడు. అంతేకాకుండా వారిని ఆ ఇంటిలో నిర్బంధించి, తన తల్లి అని చెప్పబడే ఒక మహిళను కాపలా ఉంచినాడు. బాధితురాలు మొదటి ముద్దాయి తల్లికి జరిగిన సంఘటన గురించి వివరించి, తమని విడిపించమని బతిమాలగా, ఆమె మొదటి ముద్దాయి లేని సమయం చూసి, ది. 12.12.05న వారిని ఆటో ఎక్కించి పంపివేసినది.

ఆ విధంగా నిందితుని చెరనుండి బయటపడిన బాధితురాలు ఆమె కుమార్తెతో తన పుట్టినింటికి వెళ్ళి అక్కడే ఉన్న తన భర్త, తల్లికి జరిగిన సంఘటన గురించి వివరించగా, మరుసటి రోజు బాధితురాలు ఆమె కుమార్తె, భర్త మరియు తల్లి ఉంగుటూరు పోలీసులకు విషయం తెలుపగా ఉంగుటూరు పోలీసులు పామర్రులో కంప్లైంట్ చేయమని సలహా ఇచ్చారు. అక్కడ నుండి పామర్రు వెళ్ళి పోలీస్ స్టేషన్‌లో ది. 21-12-05నాడు కంప్లైంట్ ఇవ్వగా, పామర్రు పోలీసులు బాధితురాలిని చికిత్స నిమిత్తం పామర్రు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించినారు. ఎస్.ఐ కేసును విచారించారు. సి.ఐ గుడివాడ కేసును విచారించి నిందితులను అరెస్ట్ చేసినట్లుగా తెలిపారు. డిఎస్.పి చార్జిషీటు నమోదు చేసినట్లుగా తెలిపారు.

పామర్రు సబ్ ఇన్స్‌పెక్టర్ బాధితురాలి కులధృవీకరణ పత్రము సేకరించిన తరువాత Cr.No. 155/05 భారతీయ శిక్షాస్మృతిలోని U/S 324, (ఉద్దేశపూర్వకంగానే, మారణాయుధాలతో గాయపరచడం అనేది 3సం॥రాల శిక్ష మరియు జరిమానా మరియూ రెండు విధించే నేరము) 376 (g) (సామూహిక అత్యాచారము - ప్రతి నేరస్థునికి 10సం॥రాలు లేదా యావజ్జీవ కారాగార శిక్షను విధించు నేరము) మరియు బాధితురాలు దళిత కులమునకు చెందినది కనుక ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని సెక్షన్ 3(I) (XII) (తన అధికారాన్ని ఉపయోగించి, స్త్రీనిలైంగికంగా వేధించడం, 6 నెలల నుండి 5సం॥రాలవరకు జైలుశిక్ష మరియు జరిమానా విధించదగిన నేరము) క్రింద రెండవ ఎఫ్.ఐ.ఆర్. ను నమోదు చేయడం జరిగింది. అయితే పామర్రు సి.ఐ. మొదటి ఎఫ్.ఐ.ఆర్. ఆధారంగా కేసువిచారణ చేపట్టారు.

ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున మొత్తం 23 మంది సాక్షులు, తమ సాక్ష్యం వినిపించారు. బాధితురాలు మరియు ఆమె కుమార్తె మొదటి మరియు రెండవ సాక్షిగా, సాక్ష్యం చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున 14 వస్తువులు సాక్ష్యాలుగా కోర్టులో ప్రవేశపెట్టబడ్డాయి.

ఈ కేసులో బాధితురాలు మొదటి ముద్దాయి వలన నిర్బంధించబడి సామూహిక అత్యాచారానికి గురైనదా? లేదా? ఆమె షెడ్యూల్డు కులానికి చెందినది కాబట్టి బాధించబడినదా? మరియు ప్రాసిక్యూషన్ ముద్దాయిపైన ఆరోపణలను ఏ విధమైన అనుమానానికి తావులేకుండా నిరూపించిందా? అనే అంశాలను న్యాయమూర్తి ప్రధానమైన అంశాలుగా స్వీకరించారు.

**తీర్పు సారాంశం :**

బాధితుల, నిందితుల వాంగ్మూలాలను విన్న తరువాత కోర్టు

1) ప్రథమ నిందితునికి భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 324 (ఉద్దేశపూర్వకంగా మారణాయుధాలతో గాయపరచడం -

3సం॥రాల శిక్ష మరియు జరిమానా విధించదగిన నేరం) ప్రకారంగా 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్షను విధించింది.

2) ఈ సంఘటనకు సంబంధించిన 4గురు నిందితులపై భారతీయ శిక్షా స్మృతిలోని 342 (అక్రమ నిర్బంధం - ఒక సం॥ శిక్షించదగిన మరియు జరిమానా విధించదగిన నేరం) నిరూపించబడలేదు కనుక విడుదల చేయడమైనది.

3) రెండవ మరియు మూడవ ముద్దాయిలను భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 324 ప్రకారం నేరం నిరూపించబడలేదు కనుక విడుదల చేయడం జరిగింది.

**గమనించవలసిన అంశాలు :**

1) బాధితులు షెడ్యూల్డు కులమునకు చెందినవారనీ, మరియు వారు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని, నిందుతునికి ముందే తెలిసియున్నది.

2) జడ్జిమెంట్ కాపీలోని పేజి.నెం.32, మొదటి పేరాలో బాధితురాలు షెడ్యూల్డు కులానికి చెందినందు వలననే నిందితుడు, బాధితురాలిని తీవ్రంగా గాయపరిచాడని రికార్డు పరంగా స్పష్టమైన ఆధారాలను చూపుతుంది. కాబట్టి ఎస్.సి / ఎస్.టి చట్టంలోని అంశాలు, కేసు పరిస్థితులు, వాస్తవాలను బట్టి వర్తించవు అని చెప్పబడింది. ఇది ఏ విధంగా సమంజసం.

3) వైద్య పరీక్షల ఆధారంగా బాధితురాలు సామూహిక అత్యాచారానికి గురికాలేదని తెలుపుతుంది. అయితే మనం ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే వైద్య పరీక్షలు శారీరకంగా ఏర్పడిన గాయాలకు సంబంధించిన ఆధారాలనే చూపిస్తాయి. కానీ, బాధితురాలు మరియు ఆమె కుమార్తె తెలిపిన విధంగా చూస్తే, తన కుమార్తెను చంపుతానని బెదిరించడం వలన మొదటి బాధితురాలు మానసిక వేదనకు గురై భయాందోళనకు గురై తన కుమార్తెను కాపాడుకోవాలనే భయంతో వారు జరిపిన అత్యాచారానికి బలైంది అనేది ఇక్కడ గమనించవలసిన అంశం. ఆ విధంగా ఆమె సామూహిక అత్యాచారానికి గురైందనేది గ్రహించి, భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షను 376(g) (సామూహిక అత్యాచారం - 10సం॥ లేదా యావజ్జీవ కారాగార శిక్ష విధించదగిన నేరం) ప్రకారం నిందితులు శిక్షార్హులు.

4. నిందితుడు, బాధితురాలితో తనకున్న వివాహేతర సంబంధాన్ని ఉపయోగించుకుని, ఇద్దరు బాధితులను తన ఆధీనంలో నిర్బంధించుకుని, మొదటి బాధితురాలిని వ్యభిచార కూపంలోకి లాగాలని ప్రయత్నించి ఆమె సహకరించనందువలన ఆమెను తీవ్రంగా గాయపరిచాడు.

5. 4గురు నిందితుల పైశాచిక చర్యల వలన బాధితురాలి జీవితం దుర్భరంగా మారింది. అంతేకాకుండా నిందితుని తరపు న్యాయవాది సృష్టించిన అనేక అభాండాలు లేదా అబద్ధ ఆరోపణల వలన నిందితులు శిక్ష విధించబడకుండా తప్పించుకోగలిగారు.

6. అత్యాచారాల నిరోధక చట్టం క్రింద కేసు నమోదు చేసినప్పటికీ, గౌరవనీయులైన న్యాయమూర్తి చట్టం క్రింద నిందితులను శిక్షించక, విడుదల చేయడం వలన బాధితురాలికి చట్టప్రకారం రావలసిన నష్టపరిహారం రాకుండా పోయింది. ఆమె జీవితం దారుణంగా మారింది. ఇదీ సభ్య సమాజంలో దళిత స్త్రీలకు జరుగుతున్నటు వంటి న్యాయం.

**బాధితురాలి ప్రస్తుత పరిస్థితి :**

- బాధితురాలి భర్త ఇటీవల చనిపోవడంతో, భర్తను పోగొట్టుకొని, ఎటువంటి ఆర్థిక, సాంఘిక సహకారం లేక తన మైనర్ పిల్లలతో వ్యవసాయ కూలీగా జీవిస్తున్నది.
- ఎస్.సి / ఎస్.టి చట్ట ప్రకారం కేసు నమోదు కావడంతో బాధితురాలు రూ.25000/- తక్షణ సహాయంగా పొందింది. అంతే కాకుండా నష్టపరిహారం కొరకు జిల్లా కలెక్టరుకు అర్జీ పెట్టుకుంది.
- కలెక్టర్ తన సమాధానంగా ఈ కేసులో ఎస్సీ/ఎస్టీ చట్టప్రకారం నిందితులకు శిక్ష వేయలేదు కనుక బాధితురాలు నష్టపరిహారానికి అర్హురాలు కాదని తెలిపారు.
- కలెక్టర్ గారి సమాధానంతో తల్లడిల్లిన బాధితురాలు తన పరిస్థితులను వివరిస్తూ, ది:26.5.08న తనకు ఎటువంటి ఆధారము లేదనీ, భర్త లేనందున చాలా దుర్భర స్థితిలో తన జీవితాన్ని నడుపుతుందని, తనకు సహాయం చేయవలసిందిగా కలెక్టరుకు మరలా అర్జీ పెట్టుకుంది.

**సిఫారసులు :**

1. ప్రభుత్వాధికారులు వెంటనే స్పందించి, బాధితురాలికి నైతికంగా, ఆర్థికంగా, సామాజికంగా సహకరించాలి.
2. బాధితురాలి పిల్లలకు ఉచిత విద్యనందించి వారికి ఉపాధిని కల్పించాలి.
3. బాధితురాలు కోరిన విధంగా ఇంటిని, కొంత స్థలాన్ని ఆమెకు అందించాలి.

బాధితురాలు షెడ్యూల్డు కులానికి చెందినప్పటికీ, అది తెలిసి, ఆమెను నిందితులు హింసించి, అత్యాచారం చేసినప్పటికీ ఇది ఒక సాధారణ కేసుగా భావించి, బాధితురాలికి న్యాయం చేయకపోగా, నిందితులను విడుదల చేయడం న్యాయస్థానం పట్ల బాధితులకు నమ్మకం పోగొడుతున్నది. కొందరు దళితేతరులు, పోలీసులు, ప్రభుత్వాధికారులు మాత్రమే కాదు కొన్ని న్యాయస్థానాలు కూడా దళితులకు పూర్తి న్యాయం అందించడంలో విఫలమవు తున్నాయనడానికి నిదర్శనమే ఈ కేసు. దళితులకు బ్రహ్మాస్త్రమని చెప్పుకుంటున్న షెడ్యూల్డు కులాలు మరియు తెగల అత్యాచారాల చట్టం నిర్వీర్యమౌతుందనడానికి ఇంకా ఏ సాక్ష్యాలు కావాలి? ఒకప్రక్క చట్టాన్ని దళితులు దుర్వినియోగం చేస్తున్నారంటూనే, మరోప్రక్క ఆ చట్ట ఫలాలను అందకుండా చేస్తూ ఇంకా అట్టడుగుకు దళితులను గిరిజనులను త్రొక్కుతున్న ఈ సమాజంలో వారికి న్యాయం ఏ రూపంలో, ఎవరి ద్వారా అందుతుంది? ●

# ప్రభుత్వ అనారోగ్యశ్రీ

- కృపాకర్ మాదిగ పొనుగోటి

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలుతుండటంతో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 250 ఆరోగ్య శిబిరాలను ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసింది. వరదల వల్ల నీటి కాలుష్యం పెరిగి అతిసార, డయేరియా, కలరా, టైఫాయిడ్ జ్వరాలతో సగటున రోజుకి ఆరు వేల మంది రాష్ట్రంలోని ఆసుపత్రులకు వస్తున్నట్లు ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయి. ఐతే, ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని అనధికారిక అంచనా 30 శాతం గ్రామాలకే ప్రస్తుతం రక్షిత మంచినీరు అందుతున్నది. దోమలు, కలుషిత నీరు లేని ఊరు రాష్ట్రంలోనే గాని, దేశంలోనే గాని లేదేమో! అంతటా పారిశద్ధ్య సమస్య వ్యాపించి ఉంది. దోమలు, మురికినీటివల్ల వచ్చే జబ్బులను నివారించటంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమౌతున్నాయి. గ్రామీణులు ఏటా కోట్ల సంఖ్యలో వ్యాధుల బారిన పడుతున్నారు. కుక్కకాట్లు, పాముకాట్ల వల్ల ప్రతి ఏడాది వందలాది మంది గ్రామీణులు చనిపోతున్నారు. గతంలో గన్యాదోమలు, ఇప్పుడు డెంగ్యూ దోమలు రాష్ట్రాన్ని వణికిస్తున్నాయి. ఆదివాసులు చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ వాగులు వంకలు, చెలిమలు, కుంటల్లో నీటినే తాగే పరిస్థితులు కొనసాగుతున్నాయి. రక్షిత మంచినీరు అందకపోవడం, పారిశుద్ధ్యం లోపించటం వల్లనే ఎక్కువ ప్రాంతాల్లో రోగాలు చోటు చేసుకుంటున్నాయి.

80 శాతం ఆసుపత్రులు, 80శాతం పడకలు పట్టణాల్లోనే కేంద్రీకృతమై వున్నాయి. రాష్ట్రంలో 73శాతంగా ఉన్న గ్రామీణ ప్రజల్లో కేవలం 22 శాతం మందికే వైద్య సేవలందుతున్నాయి. రాష్ట్రంలోని 12,522 ఆరోగ్య ఉప కేంద్రాల్లో సగానికి పైగా సిబ్బంది కొరతతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ప్రతి 30వేల మంది గ్రామీణ జనాభాకు ఒకటి చొప్పున, రాష్ట్రంలో మొత్తం 2,666 ఆరోగ్య కేంద్రాలు అవసరంకాగా, రాష్ట్రంలో వీటి సంఖ్య 291 మాత్రమే. ప్రజారోగ్య కేంద్రాల్లో మంజూరైన ఉద్యోగాల సంఖ్యలో పోల్చితే, 59.4 శాతం సర్జన్లు, 45 శాతం ప్రసూతి, స్త్రీరోగ నిపుణులు, 61 శాతం సాధారణ వైద్యులు, 53శాతం శిశు వైద్యులు విధుల్లో లేరని ప్రణాళికా సంఘం వెల్లడించింది. మెడికల్, పారా మెడికల్ సిబ్బంది, రోగ నిర్ణయ సేవలు, మందుల కొరత కారణంగా ప్రభుత్వ రంగంలో వైద్య సేవలు ప్రమాదకరస్థితికి పడిపోయాయని ప్రణాళికా సంఘం తేల్చి చెప్పింది. దేశం మొత్తం వ్యయంలో 3.9 శాతం మాత్రమే ఆరోగ్యం పై ఖర్చు చేస్తున్నారు. ఇది స్థూల జాతీయోత్పత్తిలో ఒక శాతం కంటే తక్కువ.

ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో 40శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భారత నర్సింగ్ కౌన్సిల్ (ఐ.యన్.సి) మార్గదర్శకాల ప్రకారం బోధనా ఆసుపత్రుల్లో ప్రతి ముగ్గురు పేషెంట్లను చూసుకునేందుకు ఒక నర్సు తప్పనిసరిగా ఉండాలి. ఇది మామూలు పరిస్థితుల్లో మాత్రమే. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో అయితే ఒక్క పేషెంట్‌కు ఒక నర్సు తప్పనిసరిగా ఉండాలన్న మార్గదర్శకాలు, నిబంధనలున్నాయి. కాని, ప్రస్తుతం సగటున 70మంది రోగులకు ఒకే నర్సు సేవలందిస్తోంది. అంటే పరిస్థితి ఎలా ఉందో సులభంగానే ఊహించుకోవచ్చు. ఐ.యన్.సి. నిబంధనల ప్రకారం 1250 పడకలున్న ఒక్క ఉస్మానియా ఆసుపత్రిలోనే 1500 మంది నర్సులు అవసరం అవుతారు. ఇప్పుడు అక్కడ ఉన్నది కేవలం 390 మంది మాత్రమే. రాష్ట్రంలో 11 టీచింగ్ హాస్పిటల్స్, జిల్లాకొక ఏరియా ఆసుపత్రి దాదాపు 1570 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలుపుకుంటే 18 వేల మందికి పైబడి నర్సులు అవసరం అవుతారు. కాని, ప్రభుత్వం 10,000 నర్సుపోస్టులను మాత్రమే ఇప్పటి వరకు కేటాయించింది. వీటిలో 1300 పోస్టులు ఇంకా భర్తీ చెయ్యలేదు. రాష్ట్రంలో 1200 స్టాఫ్ నర్సులు, 140 హెడ్ నర్సులు, 35 గ్రేడ్-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆరోగ్యశాఖ అధికారిక అంచనా వైద్యులు, నర్సు సంఘాలు ఎన్ని పోరాటాలు చేసినా వైద్య ఆరోగ్య శాఖ గత రెండేళ్ళుగా వీటిని భర్తీ చెయ్యటం లేదు. ప్రభుత్వం కొత్తగా ఒంగోలు, కడప, అనంతపురం ఆదిలాబాద్, శ్రీకాకుళం జిల్లాల్లో ఐదు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చెయ్యబోతుంది. వీటికి వెయ్యి మంది నర్సులు అవసరం అవుతారు. ఈ పోస్టులను ఔటు సోర్సింగ్‌లో కాకుండా రెగ్యులర్‌గా భర్తీ చెయ్యాలని నర్సింగ్ సంఘాలు కోరుతున్నాయి.

గత ఏడాది జూనియర్ డాక్టర్ల సమ్మెను, వారి డిమాండ్లను సాకుగా చూపి, వైద్య రంగంలో జరుగుతున్న నిలువు దోపిళ్ళను కాపాడటానికి, ఈ ప్రభుత్వం ఒక నల్ల చట్టం తెచ్చింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులను, వైద్య సిబ్బందిని నిలదీసిఅడిగినా, ఈ చట్టం ప్రకారం నేరమౌతుంది. ఆసుపత్రుల్లో మౌలిక వసతుల లేమి, మందులు, వైద్య పరికరాలలేమి, మేనేజ్‌మెంట్ల ఇష్టారాజ్య దోపిడీ వ్యాపారాలను రోగులు, ప్రజల ఆసుపత్రులు విచ్చలవిడి దోపిడి వ్యాపారాలకు ప్రభుత్వం ప్రత్యక్ష, పరోక్ష సహకారాలందించటం బాధ్యతారాహిత్యం. సాధారణ, నిరంతర ఆరోగ్య వ్యవస్థను ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేసి, కుప్పకూల్చింది. మరో పక్క ప్రజలందరికీ ఆరోగ్యం అందిస్తున్నామని చెప్పటం పచ్చిమోసం కాదా? అన్ని స్థాయిల ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించకుండా, సిబ్బంది కొరత సృష్టించి, ప్రజారోగ్యానికి పెద్ద, పీట వేస్తున్నామని పాలకులు చెప్పటం హాస్యాస్పదం కాదా? అదేమంటే ఆరోగ్యశ్రీ మహత్తర, చారిత్రక పథకం అని శెలవిస్తున్నారు! ఆరోగ్యశ్రీ పథకం కింద రెండు లక్షల రూపాయల వరకు ప్రభుత్వం ఒక్కొక్క రోగికి ఉచిత సహాయాన్ని అందిస్తుందని మంత్రులు, అధికారులు చెబుతున్నారు. పెద్ద పెద్ద జబ్బులు, పెద్ద పెద్ద ఖర్చులు వచ్చే కొంత మంది పేదరోగులకు ఈ ఆరోగ్యశ్రీ కింతవరకు లబ్ది చేకూర్చవచ్చు. తరచూ చిన్న, మధ్యతరహా జబ్బులకు గురయ్యే పేదవారి చికిత్స ఖర్చు ప్రతి ఏటా తడిసి మోపెడవుతోంది. ప్రజలకు భారీ సంఖ్యలో భారంగా ఉంటున్న యీ ఖర్చుల మాటేమిటి?

(➜ తరువాయి 10వ పేజీలో ..... )

# అత్యాచార నిరోధక చట్టంలో నేరాలు - నష్టపరిహారాలు

...✍ - **డి. భూపాల్,** సాక్షి - ప్రోగ్రాం కోఆర్డినేటర్

షెడ్యూల్డు కులాలు మరియు తెగల అత్యాచారాల నిరోధక చట్టము 1989లో రూపొందించబడినది. అయితే 1995వ సం॥రంలో నిబంధనలు రూపొందిచడంతో ఈ చట్టం అమలుకు నోచుకుంది. చట్టం గురించి కొంత అవగాహన కలిగి యున్నప్పటికీ, నిబంధనల ప్రకారంగా బాధితులకు వచ్చే తక్షణ సహాయం, నష్టపరిహారం మరియు పునరావాసాల గురించి కొందరికే తెలుసు. అందుకే అత్యాచార బాధితులకు ప్రభుత్వం ఈ చట్టం ప్రకారంగా విధిగా కల్పించిన రాయితీల గురించి బాధితులు తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో సెక్షన్3లో పేర్కొన్న 22 నేరాలకు నేర తీవ్రతను జరిగిన నష్టతీవ్రతను బట్టి నష్టపరిహారం ఉంటుంది. కనుక ఆయా నేరాలకు గురైన బాధితులకు ఇవ్వవలసిన నష్టపరిహారం ఈ క్రింద ఇవ్వడం జరిగింది.

| నెం. | నేరం | కనీస ధన సహాయం |
|---|---|---|
| 1.<br>2.<br>3. | తినకూడని అసహ్యకర మైన పదార్థం తినుట లేదా త్రాగుట (సెక్షన్ (3 (1)(i))<br>గాయపరచుటకు అవమానపరుచుట లేదా ఇబ్బంది పరచటం (సెక్షన్ (3 (1)(ii))<br>అగౌరవపరిచే చర్య (సెక్షన్ (3 (1)(iii)) | ప్రతి బాధితునికి 25,000 రూపాయలు లేదా అంతకు ఎక్కువ, నేరం యొక్క పద్ధతి తీవ్రతను బట్టి మరియు బాధితుడు అనుభవించిన దెబ్బలు,అవమానం, ఆర్థిక స్థితికి తగు విధంగా ధన సహాయం ఈ క్రింది విధంగా చేయాలి.<br>1. చార్జిషీటు కోర్టుకు పంపినప్పుడు 25%<br>2. కింది కోర్టు నిందితులపై నేర నిర్ధారణ జరిగిన తరువాత 75%. |
| 4.<br>5. | భూమిని అక్రమంగా ఆక్రమించుకొనుట లేదా సాగుచేయుట మొదలైనవి (సెక్షన్ (3 (1)(iv))<br>భూమి ఆవరణ నీరుకు సంబంధించి (సెక్షన్ (3 (1)(v)) | నేర తీవ్రత పద్ధతి బట్టి కనీసం 25,000 రూపాయ లు అవసరాన్ని బట్టి ఆవరణ భూమి / ఆవరణ / నీటి సరఫరా ప్రభుత్వమే కల్పించాలి. కోర్టుకు చార్జిషీటు సమర్పించిన వెంటనే మొత్తం నష్టపరిహారం చెల్లించాలి. |
| 6. | భిక్షమెత్తించడం లేదా బలవంతపు లేదా కట్టు బానిసత్వం (సెక్షన్ 3(1) (vi) | నేరం జరిగిన పద్ధతి బట్టి ప్రతి బాధితునికి 25,000 రూపాయలు చెల్లించాలి. ప్రథమ సమాచారము తరువాత 25% నేరనిర్ధారణ తరువాత మిగిలిన 75% చెల్లించాలి. |
| 7. | ఓటుహక్కుకు సంబంధించి (సెక్షన్ 3 (1) (vii) | నేరతీవ్రతను బట్టి ప్రతి భాధితునికి 20,000/- చెల్లించాలి |
| 8.<br>9. | తప్పుడు నష్టపరిచే విధంగా, ఇబ్బంది పరిచే విధంగా న్యాయ చర్యలు సెక్షన్ 3 (1) (viii)<br>అంతగా ముఖ్యం కాని తప్పుడు సమచారం (సెక్షన్ 3(i)(ix)) | రూ. 25,000/- లేదా వ్యాన్తవంగా అయిన ఖర్చులు, మరియు నష్టము, ఏది తక్కువ అయితే అది. ముద్దాయిపై విచారణ పూర్తి అయిన తరువాత చెల్లించాలి. |
| 10. | అవమానం, వేధింపు మరియు బాధించడం (సెక్షన్ 3(i)(x)) | నేరస్వభావాన్ని బట్టి ప్రతి బాధితునికి 25,000/- ఇవ్వాలి. చార్జిషీటు కోర్టుకు పంపిన తరువాత 25% మిగిలిన భాగము నేర నిర్ధారణ జరిగిన తరువాత చెల్లించాలి. |
| 11.<br>12. | స్త్రీ గౌరవాన్ని భంగపరచడం (సెక్షన్ 3(i)(xi)<br>స్త్రీని లైంగికంగా బాధించడం (సెక్షన్ 3(i)(xii) | ప్రతి బాధితురాలికి 50,000 రూపాయలు వైద్య పరీక్ష అనంతరం 50% చెల్లించవచ్చు. విచారణ పూర్తయిన పిదప 50% చెల్లించాలి. |
| 13. | నీటి అపరిశుభ్రం చేయడం (సెక్షన్ 3(i)(xiii) | లక్ష రూపాయల వరకు లేదా తిరిగి హక్కు పునరుద్ధరించడం మరియు జరిగిన నష్టాన్ని పూర్తి స్థాయిలో తీర్చడం, స్థలాన్ని /నివసించే |

| నెం. | నేరం | కనీస ధన సహాయం |
|---|---|---|
| | | హక్కును పునరుద్ధ రించడం మరియు 25,000 రూపాయలు ప్రతి బాధితునికి చెల్లించడం. |
| 14. | దారిలో వెళ్ళేందుకు గల సాంప్రదాయక హక్కు నిరాకరణ (సెక్షన్ 3(i)(xiv) | కనీసం లక్ష రూపాయలు లేదా జరిగిన నష్టానికి పూర్తి నష్టపరిహారం చార్జిషీటును కోర్టుకు పంపిన తరువాత 50% క్రింది కోర్టు శిక్ష విధించిన తరువాత50%. |
| 15. | సొంత నివాసం నుంచి వెళ్ళగొట్టడం (సెక్షన్ 3(i)(xv)) | స్థలమును తిరిగి స్వాధీనము చేయుట, నివసించే హక్కును పునరుద్ధరించుట మరియు ప్రతి బాధితునికి 25,000/- రూపాయలు నష్టపరి హారము, ఇల్లు ధ్వంసం చేయబడితే ప్రభుత్వ ఖర్చులతో ఇంటి నిర్మాణము చార్జిషీటు క్రింద కోర్టుకు సమర్పించిన వెంటనే నష్టపరిహారము చెల్లింపు |
| 16. | తప్పు సాక్ష్యం ఇవ్వడం (సెక్షన్ 3(2)(i)(ii)) | కనీసంఒక లక్షల రూపాయలు, లేదా జరిగిన నష్టము, హానికి పూర్తి నష్టపరిహారము 50% చార్జిషీటు కోర్టుకు పంపిన తర్వాత మరియు 50% నేర నిర్ధారణ జరిగిన తరువాత చెల్లించాలి. |
| 17. | ఇండియన్ పీన కోడ్ ప్రకారం 10 ఏళ్ళ జైలు శిక్ష లేదా అంతకు ఎక్కువ శిక్షకు అర్హమైన నేరం చేసినప్పుడు (సెక్షన్ 3(2)(v)) | అత్యాచార స్వభావం మరియు తీవ్రతను బట్టి ప్రతి అత్యాచార బాధితునికి లేదా అతనిపై ఆధారపడిన వారికి కనీసము రూ.50,000 నష్టపరిహారము ఈ నష్ట పరిహారం షెడ్యూలు నందు వేరొక విధంగా ఉన్నట్లయితే దానికను కూలంగా మారవచ్చును. |
| 18. | ప్రభుత్వ అధికారి చర్యల వలన బాధితులు కావడం (సెక్షన్ 3(2)(vi)) | జరిగిన నష్టము లేదా హానికి తగిన విధంగా పూర్తి నష్టపరిహారం. చార్జిషీట్ కోర్టుకు పంపిన తరువాత 50% నేర నిర్ధారణ జరిగిన తరువాత 50% చెల్లించాలి. |
| 19. | వైకల్యం, శారీరక మానసిక వైకల్యానికి సంబంధించిన నిర్వచనాలు, మినిస్ట్రీ ఆఫ్ వెల్ఫేర్, జి.ఒ.ఐ. నోటిఫికే షన్ నెంబర్ 4-2 83- హెచ్‌డబ్ల్యూ 3వ తేది 6-8-1986 (సవరణ లతో)వుంటాయి. నోటిఫికేషన్ కాపి అనుబంధం 2లో వుంది. | |
| | ఎ. 100% పనిచేసే శక్తి కోల్పోయినట్లయితే<br>1. కుటుంబ పోషకుడు కాని వ్యక్తి అయితే | కనీసం ఒక లక్ష రూపాయలు ప్రతి అత్యాచార బాధితునికి ప్రథమ సమాచారం (ఎఫ్.ఐ.ఆర్) నమోదయిన తరువాత 50% చార్జిషీట్ తరువాత 25% నేరనిర్ధారణ జరిగిన తరువాత 25% నష్టపరిహారం చెల్లించాలి. |
| 20. | హత్య / మరణం<br>ఎ. కుటుంబ పోషకుడు కాని వ్యక్తి అయితే<br>బి. కుటుంబ పోషకుడు అయిన వ్యక్తి | ప్రతి కేసుకు 2 లక్షల రూపాయలు పోస్టుమార్టం 75శాతం కింది కోర్టు శిక్ష విధించిన తరువాత 25శాతం చెల్లించాలి. |
| 21. | హత్య, మరణం దాడి, రేప్, మాస్ రేప్ మరియు గ్యాంగ్ రేప్<br>శాశ్వతంగా పనిచేసే శక్తి కోల్పోవడం మరియు దోపిడి బాధితులకు | పైన పేర్కొన్న విధంగా ధన సహాయం చేయడమే కాక, అత్యాచారం జరిగిన తేది నుండి మూడు నెలలలోపు ఈ క్రింది విధంగా సహాయం అందించాలి. |
| | (i) | చనిపోయిన షెడ్యూల్డు కులము, తెగలకు చెందిన వ్యక్తి మరియు లేదా వారిపై ఆధారపడిన వారికిపెన్షన్ నెలకు వెయ్యి రూపా యలు లేదా చనిపోయిన వ్యక్తి కుటుంబంలో ఒక వ్యక్తికి ఉద్యోగం లేదా వారిపై వ్యవసాయం భూమి, ఇల్లు అవసరమైతే వెంటనే కొనివ్వాలి. |
| | (ii) | బాధితుల పిల్లలు చదువు, పోషణకయ్యే ఖర్చు పూర్తిగా చెల్లించాలి. వారి పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలి. |
| | (iii) | మూడు నెలలకు సరిపడా వంట సామాగ్రి, బియ్యం, గోధుమ, పప్పుదినుసులు మొదలగునవి ఇవ్వాలి. |
| 22. | ఇళ్ళను పూర్తిగా ధ్వంసం చేయడం / తగులబెట్టడం | ధ్వంసం చేసిన, కాల్చి వేయ బడిన చోటనే ఇటుకలు / రాళ్లతో, దూలాలతో ఇల్లు నిర్మించాలి. లేదా అందుకు ప్రభుత్వం ధనం ఇవ్వాలి. |

# దళితుల హక్కుల రక్షణలో ముఖ్యమైన చట్టాలు

...✍ - **వై.మేషక్**, కో.ఆర్డినేటర్, సాక్షి

**ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం 1989:**

ఈ చట్టం రాక మునుపు దళితులపై జరిగే దాడులు భారతీయ శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్) చట్టం 1860 ప్రకారం ఆయా సెక్షనుల క్రింద కేసు నమోదులో న్యాయస్థానం తీర్పులు జరిగేవి. అంటరానితనానికి సంబంధించిన నేరాలు జరిగినపుడు పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955 (Protection of Civil Rights Act - 1955 క్రింద కేసులో నమోదు చేసేవారు.

అయితే ఎస్.సి, ఎస్.టి పిఒఎ యాక్ట్ 1989 రూల్స్ 1995 దళితుల హక్కుల పరిరక్షణలో హక్కుల వుల్లంఘనలో బాధితులకు న్యాయము, నష్టపరిహారము కల్పించడంలో ఇంతకుముందు ఏ చట్టమూ కల్పించని అవకాశము, భరోసా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ చట్టంలో వున్న కొన్ని ప్రత్యేకతలను భారతీయ శిక్షాస్మృతితో పోల్చి ఈ క్రింది విధంగా విశ్లేషించడం జరిగింది.

| భారతీయ శిక్షాస్మృతి 1860 | షెడ్యూల్డు కులాలు మరియు తెగల అత్యాచార నిరోధక చట్టం 1989 |
|---|---|
| 1. భారతదేశములోని పౌరులందరికి వర్తిస్తుంది. | 1. షెడ్యూల్డు కులాలు మరియు తెగలకు చెందిన వారికి మాత్రమే వర్తిస్తుంది. |
| 2. మొత్తము 511 సెక్షన్లు ఉంటాయి. | 2. 23 సెక్షన్లు ఉంటాయి. |
| 3. ఈ చట్టం ప్రకార సబ్-ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తారు. | 3. ఈ చట్టం ప్రకారం డిఎస్పీ హోదాకు తగ్గని అధికారి కేసు దర్యాప్తు చేస్తారు. |
| 4. సాధారణంగా ఉన్నటువంటి క్రిమినల్ కోర్టులలో కేసుల విచారణ జరుగుతుంది. | 4. ఈ చట్టం ప్రకారం ప్రత్యేక కోర్టులను ప్రత్యేక ప్రాసిక్యూటర్‌లను నియమించి కేసుల విచారణ చేస్తారు. |
| 5. చార్జిషీటు నమోదు చేయుటకు 90 రోజుల కాలపరిమితి ఉంటుంది. | 5. 30 రోజులలో చార్జిషీట్ నమోదు చేయవలసి ఉంటుంది. |
| 6. ఈ చట్టం ప్రకారంగా నిందితునిగా ముందస్తు బెయిలు వర్తిస్తుంది. | 6. ఈ చట్టం ప్రకారం నిందితునికి ముందస్తు బెయిలు వర్తించదు. |
| 7. కోర్టు తన విశేషాధికారులను ప్రయోగించి, బెయిలు ఇవ్వడం, ఇవ్వకపోవడం జరుగుతుంది. | 7. కోర్టు తన విశేషాధికారులను ప్రయోగించి, బెయిలు ఇవ్వడం, ఇవ్వకపోవడం జరుగుతుంది. |
| 8. నిందితులకు కఠిన శిక్షలు విధిస్తుంది. | 8. నిందితులకు కఠిన కారాగార శిక్షలు విధించుటయే కాక బాధితులకు తక్షణ సహాయం, నష్టపరిహారం మరియు పునరావాసం కల్పిస్తుంది. |

- దళితులకు ఉన్న ఈ ప్రత్యేక చట్టంతో పాటుగా భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్లను కూడా వర్తింపజేసుకోవడం ద్వారా నిందితులకు కఠినశిక్షలు పడుటకు అవకాశమున్నది.

**ఎస్.సి, ఎస్.టి పిఒఎ 1989 చట్టం క్రింద కంప్లైంట్ ఇచ్చేటటు వంటి సమయంలో బాధితుడు తీసుకోవలసిన జాగ్రత్తలు:**

- ✪ కంప్లయింట్‌లో తప్పనిసరిగా కులము పేరు ప్రస్తావించాలి. కులధృవీకరణ పత్రం కాపీ జతపరచాలి.
- ✪ రాజీ ప్రయత్నాలకు, ప్రలోభాలకు లోనుకాకూడదు.
- ✪ ఎఫ్ఐఆర్ లో సరైన సెక్షన్లు నమోదయ్యేలా చూడాలి.
- ✪ దళిత సంఘాల సహాయం తీసుకోవాలి.
- ✪ నష్టపరిహారం కొరకు ఆయా అధికారులకు అర్జీ సమర్పించాలి.
- ✪ కులం పేరుతో జరిపిన దాడిని దూషణను, అవమానకర చర్యలను తప్పని సరిగా కంప్లైంట్‌లో ఉండేలా చూడాలి.

**పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955 :**

పైన తెలిపిన రెండు చట్టాలూ అత్యాచారాల గురించి, హక్కుల ఉల్లంఘనల గురించిన, భౌతిక దాడులకు సంబంధించిన నేరాల గరించి, ఆస్థులకు సంబంధించిన నేరాల గరించి, కులదూషణ, సాంఘిక బహిష్కరణ మొదలైన నేరాలు, వాటికి గల శిక్షణ గురించి వివరిస్తాయి. అయితే, పౌరహక్కుల పరిరక్షణ చట్టము 1955, అంటరానితనాన్ని బోధించి, ఆచరణలో పెట్టినందుకుగాను, దాని ద్వారా వివక్షతకు లేదా అసమానత్వానికి గురైనందుకు తగిన శిక్షను నిర్ణయించు చట్టము. భారత రాజ్యాంగంలోని అధికరణ 17లో అంటరానితనము రద్దు చేయబడినట్లుగాను, దానిని ఏ రూపములోనైనను ఆచరణలో పెట్టినా, ప్రభోదించినా, ప్రోత్సహించినా లేదా పాటించినా, ఆ

విధంగా ప్రోత్సహించినా, లేదా పాటించిన వ్యక్తి చట్టప్రకారం శిక్షార్హుడని తెలుపుతుంది. ఆర్టికల్ 17 ఆధారంగా ఏర్పడిన చట్టమే పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955.

ఈ చట్టములో 17 సెక్షన్లు కలవు ఇందులో కొన్ని.

**సెక్షన్ 3** : మత సంబంధమైన అసమానతలు, వివక్షత పాటించినపుడు విధించు శిక్ష- ఉదా: ఒక వ్యక్తిని అంటరానివాడనే కారణంతో దేవాలయాలలోకి రానివ్వకపోవడం, పుణ్యస్నానాలు ఆచరించనివ్వకపోవడం మొదలైనవి.

**సెక్షన్ 4** : సాంఘిక అసమానతలు, వివక్షత పాటించినపుడు విధించు శిక్ష - ఉదా: 1)దుకాణాలు, హోటళ్ళు, వినోద ప్రదేశాలకు, సత్రాలు, ప్రయాణికుల వసతిగృహాలు మొదలైనవి ఉపయోగించుకో నివ్వకపోవడం. (2) వృత్తి ఉద్యోగం, వ్యాపారం చేసుకో చేసుకో నివ్వకపోవడం (3) నదులు, చెరువులు, కుళాయిలు, స్నానఘట్టాలు, స్మశానవాటిక, పారిశుధ్య సౌకర్యం, బహిరంగ ప్రదేశాలను వాడుకోనివ్వక పోవడం (4) నివాస ప్రాంతంలో గృహాన్ని నిర్మించనివ్వకపోవడం, దానిలో నివసించనివ్వకపోవడం.

**సెక్షన్ 5** : ఆసుపత్రులు మొదలైన వాటిలో చేర్చుకొనుటకు వ్యతిరేకించుటకు విధించు శిక్ష

**సెక్షన్ 6** : అంటరాని వ్యక్తి అనే కారణంతో, ఆ వ్యక్తికి సరుకులు అమ్మట నుండి లేక సేవ చేయుటకు నిరాకరించుటకు విధించు శిక్ష

**సెక్షన్ 7** : అంటరానితనమును పాటించుటద్వారా శారీరక హింసకు గురిచేయుట, ఏదేని హక్కును అనుభవించనీయకుండా ఆటంకపరచుటకై విధించు శిక్ష. మరియు చట్ట వ్యతిరేక నిర్బంధ చాకిరి, అసహ్యమైన పనులు బలవంతంగా చేయించుట.

**సెక్షన్ 10** : నేరస్తులకు సామూహిక జరిమానా విధించే అధికారము ప్రభుత్వానికి కలదు.

**సెక్షన్ 11** : అదే నేరమును రెండవసారి చేసిన యెడల ఆరుమాసముల నుండి ఒక సంవత్సరంవరకు జైలుశిక్ష మరియు జరిమానా విధించబడును.

- ఈ చట్ట ప్రకారంగా బాధితులకు తక్షణ సహాయం, నష్టపరిహారం మరియు పునరావాసాలు కల్పించబడవు.

- పౌరహక్కుల పరిరక్షణ చట్టం గురించి అవగాహన లేకపోవడంవలన సాధారణంగా ఈ చట్టంక్రింద కేసులు నమోదు కావడం చాలా అరుదు.

- ఈ చట్టప్రకారం నేరస్తులకు ఒకనెల నుండి 6 నెలల వరకు జైలుశిక్ష మరియు జరిమానా విధించబడును.

- అదే నేరమును మూడవసారి చేసిన యెడల ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరముల వరకు జైలుశిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

ఎంతో బలమైన ఈ చట్టాలను దళితులు / గిరిజనులు ఉపయోగించుకొని వారికున్న హక్కులను కాపాడుకోవడమే కాకుండా, హక్కుల ఉల్లంఘన జరిగినపుడు తగిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంది. కనుక ఈ చట్టాలను అందరూ ఉపయోగించుకోవాలి. దీని ద్వారా సాంఘిక, రాజకీయ చైతన్యం పొంది, పౌర, రాజకీయ హక్కులను కాపాడుకోవాలి.

---

*(➜ 7వ పేజీ తరువాయి ..... )*

ప్రభుత్వం చెల్లిస్తుందా? ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అమలు జరిపే స్థితిలో ప్రభుత్వం లేదు. ఈ పథకం పేరుతో ఉన్న ప్రభుత్వ నిధులను వైద్యం కంపెనీల ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చడానికే ప్రభుత్వం పూనుకోవటం అన్యాయం.

పౌరుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వమే బాధ్యతవహించాలి. పేదవారందరికీ ఉచిత ఆరోగ్య భీమా ప్రభుత్వం కల్పించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏరియా జిల్లా అసుపత్రుల్లో అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించి ప్రభుత్వం మౌలిక సౌకర్యాలను ఏర్పాటుచేయాలి. గ్రామీణ, పట్టణ నగర ప్రాంతాలలోను, ప్రత్యేకించి గిరిజన దళిత ప్రాంతాల్లోను పారిశుధ్య, ఆరోగ్య, సమస్యలపై కనీస అవగాహనను శాస్త్రీయంగా కల్పించడానికి సమావేశాలను, శిక్షణా కార్యక్రమాలను ప్రభుత్వం తరచూ నిర్వహించాలి. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమన్యాల నిర్లక్ష్యాలను దోపిడీని, వైద్యుల, వైద్య సిబ్బంది నిర్లక్ష్యాలను, బాధ్యతారాహిత్యాలను కాపాడడానికి గత సంవత్సరం తెచ్చిన చట్టాన్ని ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలి. ఆరోగ్యశ్రీ ప్రచారం చాటున ప్రాథమిక అత్యవసర ఉన్నతవైద్యాన్ని పడకెక్కించే బాధ్యతారాహిత్యాన్ని ప్రభుత్వం వొదులుకొని లేదంటే, ప్రజావైద్యాన్ని ప్రైవేటుకు వొదిలేసిన ప్రభుత్వ అనారోగ్యశ్రీని ప్రజాఉద్యమాలతోనే వొదిలించుకోవాలి. ●

## మరో బ్రహ్మ

*ఒక్క చూపుడు వేలితోనే*
*కుల రక్కసిని కూల్చినావు*
*ఒక్క కలంపోటుతోనే*
*మా నుదుటి రాతలు మార్చినావు*
*ఉన్నవాళ్లకు*
*లేనివాళ్ల*
*ఊడిగం యిక ముగియనుంది*
*బాబా, ఇంకో పదేళ్లు*
*నీవు బతికివుంటే*
*భారతావని బతుకంతా మారిపోయేది !*

**- డా॥ బోయజంగయ్య**

# పాకీవృత్తిని నిర్మూలించడం ద్వారానే ఆత్మగౌరవం సాధించుకుందాం!

...✍ - **సి.రఘుపతిరావు,** సఫాయికర్మచారి ఆందోళన్

మనుషులందరూ మట్టిలోపుట్టి మట్టిలోనే కలుస్తారు గానీ, వీళ్ళుమాత్రం "మలినంలో పుట్టి మలినంలో కలుస్తారు. ఊహ తెలిసినప్పటి నుంచి ఊపిరున్నంత వరకు ఊరి వాళ్ళ మల మూత్రాలను ఎత్తివేస్తూ బతుకు బండిని లాగుతున్న వాళ్ళే సఫాయి కర్మచారులు. శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచదేశాలతో పోటీపడుతూ ముందుకు వెళ్తున్న భారతదేశం మనుషుల మలాన్నీ, చేతులతోఎత్తివేసే పనిని మాత్రం దళితుల చేత చేయించే సంస్కృతి ఇంకా కొనసాగుతున్నది. నేటి ఆధునిక సమాజంలో మానవ మలాన్ని వెనక్కి తిరిగి చూసుకోవడానికి అసహ్యించుకునే ఈ రోజుల్లో, ఆ మలాన్నిచేతులతో ఎత్తి గంపలో పెట్టుకొని పోయి ఊరవతల పారవేసే దుస్థితిలో దళితులలోని సఫాయి కర్మచారులు ఉన్నారంటే, ఈ ప్రభుత్వాలు శాస్త్ర సంకేతికరంగాలలో ఏ రకమైన అభివృద్ధి సాధించాయో తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మనదేశంలోని దళిత ప్రజలు దుర్మార్గమైన కులవ్యవస్థకు బలిపశువులు అయినారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని నిచ్చెనమెట్ల కులవ్యవస్థ భారతదేశంలోనే ఉంది. మనువు వ్రాసిన మనుధర్మ సిద్ధాంత ప్రకారం మనుషులను (కులాలుగా) విభజించి వారు చేయవల్సిన పనులను కూడా విభజించింది. 3 వేల సం॥ రాల ముందునుండే కొనసాగుతున్న ఈ నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అట్టడుగు స్థానంలో ఉన్న దళితులను అంటరాని కులాలుగా, నీచ కులాలుగా చిత్రీకరించి కులకట్టుబాట్ల పేరుతో అమానవీయ కులవృత్తులలో బంధించి వేసింది. దళితులపైన నిర్బంధంగా రుద్దిన అమానవీయ వృత్తి ఇది దళితులలోనే మరింత క్రిందిస్థానంలో ఉన్నవారు మనుషుల మలాన్ని శుభ్రం చేస్తూ జీవనం గడుపుచున్నారు. ఈ హైటెక్ యుగంలోను దేశమంతటా ఏదో ఒక రూపంలో ఈ పాకీ పని కొనసాగుతూనే వుంది.

దేశంలో సఫాయి పనిచేసే వాళ్ళను ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరుతో పిలుస్తారు. బెంగాల్ మెహధర్స్, భంగీ, తమిళనాడులో తొట్ట, పంజాబులో మిరా, లాల్‌బెసి చురీ, బాలాషాహి, ఢిల్లీ, రాజస్తాన్‌లో వాల్మీకి యొహదరి, చహరా మొదలైన పేర్లలో పాకీ పని వారిని పిలుస్తారు. మన రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, కొస్తా ప్రాంతాలలోని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలో మాదిగలోని ఒక ఉపకులమైన రెల్లి కులంవారు. ప్రకాశం జిల్లాలో కనిగిరి, మార్కాపురం ప్రాంతాలలో మాలవారు, గుంటూరు, నెల్లూరు జిల్లాలోఒ క భాగంలో యానాదులు, అనంతపూర్‌లోని కర్నాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో ముస్లింలలో ఒక తెగ అయిన హలాల్‌కోర్‌లు, తెలంగాణ ఇతర ప్రాంతాలలో మాదిగలు ఈ వృత్తిని చేస్తున్నారు. గత 40 సం॥ల క్రితమే పంచాయితీరాజ్ శాఖ తరుపున ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు కాక, సామూహిక మరుగుదొడ్లను నిర్మించడం జరిగింది. ఈ మరుగుదొడ్లలో పేరుకుపోయిన మలాన్ని ఎత్తివేసే వృత్తిని చేపడుతూ వందలాది కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. మలాన్ని ఎత్తి శుభ్రం చేస్తూ కడుదయనీయమైన పరిస్థితులు అనుభవిస్తున్న వారిలో ఎక్కువ శాతం దళిత కులాలకు చెందినవారు కావడం ఒకటైతే, పనిలో ఎక్కువమంది స్త్రీలు ఉండడం రెండోకారణం. ఈ వృత్తిలో ఉన్న వారిలో దాదాపుగా 60శాతం మంది మహిళలే.మన రాష్ట్రంలోని 8402 మందిలో 5632 మంది మహిళలే. మనదేశంలో కొనసాగుతున్న నిచ్చెనమెట్ల కులవ్యవస్థ పితృస్వామ్య వ్యవస్థ రెండు కలగలిపి విడదీయరాని సంబంధం కొనసాగుతున్నాయి.

1992 సం॥లో దేశ వ్యాప్తంగా వివిధ సామాజిక సంస్థలు, దళిత సామాజిక వేత్తలు నిర్వహించిన సర్వేల ప్రకారం మనదేశంలో దాదాపు 13 లక్షల మంది మలమూత్రాలను ఎత్తివేసే పనిలో ఉన్నట్లు తెలిసింది. అలాగే మన రాష్ట్రంలో 8,402 మంది ఈ పనిలో ఉండగా, వీరిపై 22,519 మంది ఆధారపడి జీవిస్తున్నారు. 13 లక్షల మంది పనివారిలో దాదాపు 95శాతం దళిత కులాలకు చెందినవారు కావడం జగమెరిగిన సత్యం దేశవ్యాప్తంగా అనేక సామాజిక సంస్థలు, దళిత మేధావులు పెద్ద ఎత్తున ఉద్యమించడంతో కేంద్ర ప్రభుత్వం 1993 సం॥లో చేతులతో మలాన్ని ఎత్తివేసే వారిని పనిలో పెట్టుకోవడం డ్రైలెట్రిన్లు నిర్మూలాన్ని నిషేదిస్తూ పార్లమెంట్ చట్టం తీసుకు వచ్చింది. కానీ అనేక చట్టాలకు పట్టిన దుర్గతే ఈ చట్టానికి పట్టి ఈ అమానవీయ వృత్తి ఇంకా సజీవం గానే కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వం పారిశుద్య పనివారిపై, ఆధారపడి వారికి ఈ పని నుంచి విముక్తి కల్పించి భద్రతతో కూడిన పునరావాసం కల్పించడానికి సుమారుగా 600 కోట్ల రూపాయలను కేటాయించినప్పటికి 5శాతం మాత్రమే ఖర్చు చేసింది. దీనికి అసలైన కారణం అగ్రకుల ఆధిపత్య కులాలకు చెందిన అధికారులు, రాజకీయ నాయకులుకావడం వల్లనే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

భారతదేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు సైతం ఇలాంటి నిజమైన పాకీ పనిని కొనసాగించకూడదని, హెచ్చరికలు జారీ చేసినా, చిత్తశుద్ధిలేని అగ్రకుల మనువాద పాలకవర్గ ప్రభుత్వాలు న్యాయవ్యవస్థ రూపొందించిన చట్టాలను అమలు పరచలేకపోయాయి. ఈ క్రమంలో సఫాయి కర్మచారులు పాకీ పనిని నిర్వహిస్తూ, మురికి కూపంలోనే తమ దుర్భర జీవితాలను వెళ్ళదీస్తున్నారు.

చేతులతో మలాన్ని ఎత్తివేసే దురాచార పాకీవృత్తిని చేపట్టడం మూలంగా సఫాయి కర్మచారులు ఆత్మగౌరవాన్ని పోగొట్టుకోవడమే కాకుండా దుర్గందపు వాసనతో అనారోగ్యానికి గురై అనేకమంది అర్థాంతరంగా తమ జీవితాలను చాలించాల్సిన పరిస్థితుల్లో ఉన్నారు. అలాగే ఈ వృత్తులు చేసే వారికి ప్రతిఫలం (వేతనం) అత్యంత తక్కువగా నిర్ణయించి, ఆ కుటుంబాలను పాతాళంలోకి తొక్కి, నిత్యం ఆకలి కేకలతో అలమటించేలా చేసింది. ఆర్థికంగా తీవ్ర

(☛ తరువాయి 13వ పేజీలో ..... )

# దళిత వాడపై మూకుమ్మడి దాడి - ఒక యువకుడి దారుణ హత్య

...✍ - **డి. భూపాల్,** ప్రోగ్రాం కో.ఆర్డినేటర్

| | | |
|---|---|---|
| గ్రామము | : | పొట్టిలంక |
| మండలము | : | కడియం |
| జిల్లా | : | తూర్పుగోదావరి<br>కోస్తాంధ్రా |
| సంఘటన | : | దళిత వాడపై దాడి ఇండ్లు ధ్వంసం ఒక దళిత యువకుడి దారుణ హత్య |
| సంఘటన తేది | : | 21 జూన్ 2008 |
| దాడి చేసిన వ్యక్తులు | : | కాపు కులమునకు చెందిన దాదాపు 300 మంది |

**గ్రామములోని సామాజిక అర్థిక పరిస్థితులు :** పొట్టిలంక అనే గ్రామము సముద్రతీరానికి ఆనుకొని (గోదావరి) ఉన్నటువంటి గ్రామముఈ గ్రామములో దళితులు(అధికంగా మాలలు) దాదాపు 300 కుటుంబాలు ఉంటాయి, ఇదే గ్రామములో కాపు కులానికి చెందిన (ఓసి) వారు దాదాపు 900 కుటుంబాలు ఉంటాయి. ఈ గ్రామములో దళితులకు 40 కుటుంబాలకు కేవలం ఒక ఎకర, 1/2 ఎకరా భూమి కలిగి ఉన్నారు. మిగతా దళిత కుటుంబాలకు ఒక సెంటు భూమి కూడా లేదు. దళితులు అందరుకూడా కాపు కులానికి చెందిన వారి భూములలో కూలీ పనిమీదనే ఆధార పడి జీవిస్తున్నారు. ఈ గ్రామములో సర్పంచ్ మండల ప్రజాపరిషత్ మెంబరు ఎస్సీలు (రిజర్వేషన్‌లో) ఉన్నారు. 2007లో జరిగిన ఎన్నికలలో గెలిచినారు.

**సంఘటన వివరాలు :** జూన్ 21 (శనివారం) 2008 7.30 సాయంత్రం సమయంలో 350 నుండి 400మంది కాపు కులానికి చెందిన వారు ఒకసారి మారుణాయుదాలతో, ఇనుపరాడ్లు, కర్రలు, ఇటుక, రాళ్ళు తీసుకొని దళిత వాడపై మూకుమ్మడి దాడి చేసినారు దాడిలో దొరికిన వ్యక్తిని దొరికినట్లు కొట్టినారు. దళితుల ఇండ్ల పెంకులను పగులగొట్టినారు, ఇంటి కిటికీలను, తలుపులను విరగగొట్టినారు దళితుల సైకిళ్ళను (10) నుజ్జునుజ్జు చేసి విరగగొట్టినారు, ఈ దాడిలో దాదాపు 10మంది తలలు పగిలినాయి, కాళ్ళు, చేతులు విరిగినాయి ఒక దళిత వీరపండు అనే యువకుడు కూలిడబ్బుల కొరకు అని ఇంటిలోనుండి బయలుదేరి ఇంటి భయటికి 50 అడుగులు వేసినాడు. అంతే అల్లరి (కాపు) మూకలు ప్రక్కనే ఉన్న బోరు పంపుదండను పీకి విరపండు తలపై బాదడంతో అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయినాడు. కొంత మంది కాళ్ళు చేతులు విడగటంతో అక్కడే నడవలేని స్థితిలో పడిపోయినారు. ఈ దాడిలో చిమ్మడిలంక. మరియు ఆగ్రారం గ్రామాలకు చెందిన కాపు. వ్యక్తులు కూడా పాల్గొన్నారు.

ఇంతటితో ఆగకుండా కనపడిన దళిత మహిళలను కూడా పొలాలగుంటా ఉరికించి కొట్టినారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి. వారి చీరలు పట్టి లాగటం. బ్లౌజులు చించివేసి కులం పేరుతో తిట్టడం జరిగినది. సంఘటన తరువాత దళిత వాడలోకి చిన్న పిల్లలకు కావలసిన, పాలు, బ్రెడ్ లాంటివి అందు బాటులో లేకుండా చేసినారు. దళితులకు గ్రామములో ఉన్న దుకాణాలలో వస్తువులు అందకుండా చేసినారు. గాయపడిన దళితులను రాజమండ్రి ఆసుపత్రిలో చేర్చినారు. దాదాపు 10 నుండి 15 రోజులు దళితవాడ భయం గుప్పిటిలో ఉండినది.

**సంఘటనకు గల కారణాలు :** 1977లో శ్రీమతి ఇందిరాగాంధీ దేశ ప్రధానిగా ఉన్నప్పుడు గ్రామములోని కొంత మంది దళితులకు 5 ఎకరాల భూమి ఇవ్వటం జరిగింది. దీనికి అప్పుడే కాపులు వ్యతిరేకించి మూడు నెలలు వ్యతిరేక పోరాటం చేసినారు. గ్రామములో 3 నెలలు పోలీసు పికెట్ పెట్టినారు. దాదాపు 3సం॥లు దళితులను సాంఘీక బహిష్కరణకు గురి చేసినారు. దళితులను పొలాల్లో పనికిరానివ్వలేదు. అదే సంవత్సరంలో దళితులకు ప్రభుత్వం ఇండ్లను ఇవ్వటం జరిగినది దీనికి కూడా కాపులు ఒప్పుకోలేదు.

1990లో ఒక దళిత యువకుడు పిల్లి చిన్న యం.పి.టి.సి గా ఎన్నికైనాడు కాని కాపు కులస్థులు విధులకు హాజరు అవకుండా అడ్డుతగిలినారు కనీసం కుర్చీలో కుర్చోవడానికి కూడా ఒప్పుకోలేదు. ఈ సంఘటనలో దళితులు 1992లో కొత్తపల్లి చిన్న అనే కాపు వ్యక్తిపై ఎస్సీ/ఎస్టీ కేసుపెట్టడం జరిగింది. పై సంఘటనలు అన్నీ కూడా ఈ రోజు జరిగిన దాడికి అంతర్గత కారణాలుగా కనబడుతున్నది.

20 జూన్ 2008.15 మంది దళితులు మామిడి మొక్కలు నాటి పనిలోకి కూలీలుగా వెళ్ళినారు. అక్కడ కొంత మంది కాపు యువకులు చిరంజీవి పార్టీలోకి రావాలని కాపులు నిర్వహించే ర్యాలికి రావాలని పట్టుపట్టడంతో దళితులు వ్యతిరేకించినారు. అదే రోజు సాయంత్రం ఒక దళిత యువకుడు కోడిపూడి సీతయ్య హోటల్‌లో టిఫిన్ చేస్తున్న సమయంలో చిన్న ఘర్షణ జరగగా గట్టి బుర్రయ్య అనే కాపు వ్యక్తి దళితుడిని కొట్టినాడు.

అదే సమయంలో రోడ్డుకు అవతలివైపు రాజు మరియు అంబటి రాజారత్నం అనే దళిత యువకులను కొట్టినారు కారణం ఏమిటంటే అదే గ్రామానికి చెందిన కాపు వ్యక్తి ఒక హోటల్ మెయిన్ రోడ్డుపై పెట్టినాడు. అతడు ఆహోటల్‌లో వేశ్య గృహంలా మహిళతో వ్యాపారం చేస్తున్నాడు. అదే హోటల్‌లో కూర్చున్న ఒక 5సం॥ల చిన్న పాప కాపు కులానికి చెందిన పాపను అంబటి రాజరత్నం

ముద్దుపెట్టుకున్నాడనే నెపంతో దళిత వాడపై దాడి చేసి ఒక వ్యక్తిని చంపటం, 10 మందిని తీవ్రంగా కొట్టి హింసించడం జరిగింది.

**ప్రభుత్వ అధికారుల స్పందన :** పోలీసువారు దళితులకు రక్షణ కల్పించటంలో పూర్తిగా విఫలమైనారు.

- సంఘటనకు కారకులైన వ్యక్తులను అరెస్టు చేయడంలేదు.
- బాధిత కుటుంబాలకు పూర్తి రక్షణ, తక్షణ పునరావాసం, నష్టపరిహరము అందించలేదు.
- చనిపోయిన వీరపండు కుటుంబానికి 1,50,000/- నష్టపరిహారంగా ఇస్తామన్నారు కాని ఇవ్వలేదు.
- దళతులకు పొట్టిలంకలో పూర్తి రక్షణలేదు.

**బాధితుల డిమాండ్లు :**

- తక్షణమే ప్రధాన నిందితులను అరెస్ట్ చేయాలి.
- డి.ఎస్.పి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. (సాయిబాబా డి.ఎస్.పి)
- కేసులో సరియైన ఎస్సీ/ఎస్టీ సెక్షన్ పెట్టాలి. 3(i)(xi), (xiv), 32(iii) and 3(2)(v) ఎస్సీ/ఎస్టీ యాక్ట్ 1989
- భాదిత కుటంబాలకు చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి జీవనోపాది కల్పించాలి.
- గ్రామములో సాధారణ పరిస్థితి వచ్చేవరకు పోలీస్ పికెట్ ఏర్పటు చేయాలి.
- చనిపోయిన కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలి. ●

---

(➜ 11వ పేజీ తరువాయి ..... )

ఇబ్బందులు ఎదుర్కొంటున్న సఫాయి కర్మచారులు, వారి పిల్లలకు కనీస చదువులు చెప్పించుకునే స్థితిలోలేకపోవడం వలన చాలామంది బాల కార్మికులుగా మారుతున్నారు. వారి పిల్లలు కూడా వంశపారం పర్యంగా వస్తున్న ఈ పాకీ వృత్తిలోకి బలవంతంగా నెట్టబడుతున్నారు. సఫాయి కర్మచారులుఎన్నో వ్యధలకు గురువుతూ, ప్రభుత్వాల ఆదరణకు దూరమై దిక్కులేని పరిస్థితుల్లో ఈవృత్తిని కొనసాగిస్తున్న ప్పటికీ, వారి బాగోగుల గురించి పాలకులెవ్వరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

నేటికి సఫాయి పని నీచమైన దురాచార సంస్కృతిలో ఏళ్ళ తరబడికొట్టు మిట్లాడుతున్న సఫాయి కర్మచారులకు విముక్తి కల్పించాలన్న ముఖ్య ఉద్దేశ్యంలో 1993 సం॥ లో డా॥ బి.ఆర్. అంబేద్కర్ చూపిన ఆత్మగౌరవ బాటలో సఫాయి కర్మచారి ఆందోళన్ (ఎస్.కె.ఎ.) అనే సంస్థ ప్రారంభమైనది. అంబేద్కర్ గారి సిద్ధాంతం ప్రకారం దళితులకు కనీస అవసరాలైన కూడు, గూడు, నీడ కన్న మించింది. ఆత్మగౌరవమని, ఆత్మగౌరవం లేకుండా బ్రతికే కన్నా చావడం మేలన్నారు. ఆంధ్రరాష్ట్రంలో కారంచేడు, చుండూరు దళితులు చిందించిన నెత్తురు దళిత ఆత్మగౌరవపోరాటాల్ని పదునెక్కించడమే కాకుండా, ప్రతిఘటన పోరాటాలకు దారి చూపింది. తరతరాలుగా అగ్రకుల పెత్తందారులదాడులు, అణచివేతకు గురైన దళితులు స్వతంత్ర్యంగా ఉద్యమం నడుపుకోవాల్సిన చారిత్రక అవసరాన్ని ముందుకు తెచ్చింది. అంటరానితనం, అవమానాలు, అత్యాచార హత్యలు, మౌనంగా భరిస్తూ మూగగా రోధిస్తున్న గొంతుల్లో పాలికేకల్ని ధ్వనింపచేసింది. సఫాయి కర్మచారి ఆంధోలన్ ఉద్యమం ఒక ఆత్మగౌరవ పోరాటం, దళితులు బతకడం కోసం, గుర్తింపును కాపాడుకునే స్వేచ్ఛ కొరకు, జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. దళితుల ఆశాజ్యోతి డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారు చూపిన విముక్తి మార్గంవైపు పయనిస్తున్న లక్షలాది సఫాయి కర్మచారులు తమ కన్నీళ్ళకు పరిష్కారం చూపుతారని నమ్మకంతో ఎస్.కె.ఎ. ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమాలలో మమేకమౌతు ఉద్యమాలకు ఊపిరి అవుతున్నారు.

గత 9 సం॥రాలుగా దేశంలోనే గాక, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని డ్రై లేట్రీన్లు పడగొట్టి ఆ వృత్తిలో ఉన్న సఫాయి కర్మచారులను జాగృతం చేసి పునరావాసం కల్పించి మానవీయ విలువలను పరిరక్షించాలన్నదే ప్రధాన ఉద్దేశ్యం. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సఫాయి పని వారి జీవితాల్లో ఒక సమగ్రమైన మార్పు తీసుకురావడానికి వారిలో చైతన్యం కల్పిస్తుంది. మన రాష్ట్రంలో డ్రైలెట్రిన్లు అన్నింటిని కూల్చి, సఫాయి కర్మచారులకు పునరావాసం కల్పించడంలో మన ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందడంతో డ్రై లెట్రిన్లు కూల్చే బాద్యతను అనేక ప్రజా, దళిత సంఘాల సహకారంతో సఫాయి కర్మచారి ఆందోళన్ శ్రీకారం చుట్టి దళితుల ఆత్మగౌరవ పోరాటానికి నాంది పలికింది. సఫాయి కర్మచారుల ఆత్మగౌరవాన్ని నలుదిశలా చాటడానికి మనం ఒంటరివాళ్ళం కాదు. మనకు తోడుగా సభ్యసమాజం ఉందని వెలుగెత్తి చెప్పి వారిలో ఆత్మస్థైర్యాన్ని ఇవ్వడం జరిగింది. పొట్టకూటికోసం మనుషుల మలాన్ని చేతుల్తో ఎత్తివేస్తూ అమాసచీకట్లో అలమటిస్తున్న సఫాయి కర్మచారుల జీవితాలలో వెలుగును ప్రసాదించేందుకు ఎస్.కె.ఎ. నిరంతరం కృషి చేస్తున్నది.

ప్రపంచీకరణ నేపధ్యంలో అన్నిరంగాలు వ్యాపారమైనట్లుగానే మానవ సంబంధాలుకూడా, వ్యాపార సంబంధాలుగా మారిపోయి నాయి. నేటి సమాజంలో మనిషి మనిషిగా జీవించకుండా, మనిషి మానవత్వాన్ని మరిచి జీవించడం చాలా బాధకరమైన విషయం. అగ్రకుల మనువాద పాలకవర్గ ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా మనుషుల్లో చూసే నీచ సంస్కృతి తొలగిపోవాల్సిన అవసరం వుంది. 'కులం' ఓ ముసుగు అంటూ అంటరానితనంతో ఆత్మగౌరవాన్ని, వ్యక్తి స్వేచ్ఛను, బలిపెడుతున్న ఆధునిక సమాజం తీరు తెన్నుల్ని దళితులు ప్రతిఘటిస్తున్నారు.

సఫాయి పనివారి జీవితాలలో మార్పును తీసుకు వచ్చినపుడే సమాజంలోని మనుషులందరు సమాన స్వేచ్ఛ, ఆత్మగౌరవం కల్గి జీవించడానికి దోహదపడుతుంది. మనిషిని మనిషిగా చూడని మనువాదాన్ని నిర్మూలించి, మానవీయ విలువలున్న సమతావాదాన్ని, ఆవిష్కరించుకుందాం. 'సఫాయి కర్మచారి ఆందోళన్' ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమాలలో మమేకం అవుతారని, నిన్న కొందరే, నేడు మరెందరినో, మనతో కలుపుకుంటూ సమూహమై, ప్రవాహమై ముందుకు నడుద్దాం. ●

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు : జూన్-జులై 2008

| వ. నెం. | స్థలము | నేరం | తేది / సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 1. | వరంగల్ | ప్రేమపేరుతో దాడి | 4.6.08న పరకాల (రూ) రంగాపురం గ్రామానికి చెందిన శిరీషను (17) అదే గ్రామంలోని దార్న శివాజీ (ముదిరాజ్) ప్రేమపేరుతో వెంటపడ్డాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శిరీషను పెళ్ళి చేసుకుంటావా? లేక చనిపోతావా? అని వేధించడంతో నిరాకరించింది. దాంతో అదే ఇంట్లో ఉన్న ఐదు లీటర్ల కిరోసిన్‌ను ఆమెపై పోసినిప్పంటించాడు. బాధితురాలు పరకాలలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. |
| 2. | తూర్పుగోదావరి | కులదూషణ | 31.5.08న అమలాపురం, సమనస గ్రామానికి చెందిన గోడరాజ్‌కుమార్‌ను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూషించి, దాడిచేశారు. |
| 3. | శ్రీకాకుళం | కులదూషణ | 31.5.08న పలాస - కాశీబుగ్గ మెగాపు గాంధీ అనే వ్యక్తి కూర్మాపు క్రిష్ణమూర్తిని కులం పేరుతో దూషించాడు. |
| 4. | మెదక్ | సాంఘిక బహిష్కరణ | 01.6.08 సంగారెడ్డి అర్బన్, పెద్దకోడూరు గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన అగ్రవర్ణ పెత్తందార్లు |
| 5. | మెదక్ | ప్రేమ పేరుతో మోసం | 08.06.08న పాపన్నపేట, కొల్చారం మండలంలోని పోతిరెడ్డి పల్లి పాఠశాలలో పనిచేస్తున్న దళిత ఉపాధ్యాయురాలైన జెల్ల మమతను ప్రేమించి, పెళ్ళిచేసుకుంటానని వంచించిన టి. విజయకుమార్ (టీచర్) పెళ్ళిచేసుకోమని అడిగినందుకు కులం పేరుతో దూషించాడు. |
| 6. | విశాఖపట్నం | ప్రేమ పేరుతో మోసం | 10.06.08న కశింకోట (మం), పరవాడ పాలెం గ్రామానికి చెందిన తీడరాము మైనర్ బాలికను నమ్మించి, ఆమెను గర్భవతిని చేశాడు. పెళ్ళి ప్రస్తావన తీసుకురాగానే బలవంతంగా ఆబార్షన్ చేయించడానికి ప్రయత్నించారు. కుల, గ్రామ పెద్దలు ఆమెకు పంచాయితీలో 50వేలు వెలకట్టారు. |
| 7. | హైదరాబాద్ | దళితులపై హత్య బెదిరింపులు | 11.06.08న జీడిమెట్ల, ప్రకాశం జిల్లా కనిగిరి మండలం, వల్లిపల్లి గ్రామానికి దళితులు అగ్రకులాల వారి దగ్గరలో ఉన్న ప్రభుత్వ భూమిలో తమకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని ఎంఆర్‌ఓకు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఆగ్రహించిన అగ్రకులాలవారు "మా ఇళ్ళ ప్రక్కన మీకు ఇళ్ళు కావాలా" అంటూ దళితులను హత్య చేస్తామని బెదిరించారు. |
| 8. | కడప | కులదూషణ | 11.6.08న రాయదుర్గం జూకల్ ఎమ్మెల్యే గంగారం తనకు సర్వే నెం. 29లో స్థలముందని ఆ స్థలాన్ని పిసి రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించారని తన స్థలం చుట్టూ ఉన్న ప్రహారీని కూల్చేందుకు ప్రయత్నిస్తున్న ప్రత్యర్ధులను అడ్డుకున్న తనను కులంపేరుతో దూషించారని నిందితులపై ఎస్.సి / ఎస్‌టి కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. |
| 9. | మహబూబ్‌నగర్ | కిడ్నాప్ | 8.06.08న మక్తల్, కర్ని గ్రామానికి చెందిన చంద్రయ్య కూతురును (16) మైనర్ ఆది లింగప్ప (24) గత 9 నెలలుగా పెళ్ళి చేసుకుంటానని తీసుకుని వెళ్ళి ఇంకా తీసుకురాకపోవడంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. |
| 10. | తూర్పుగోదావరి | దళితులపై దాడి హత్య | 21.06.08న రాజమండ్రి పొట్టిలంకలో దళితులపై మరొక సామాజిక వర్గం దాడి చేశారు. దళితులలో వీరపండు అనే వ్యక్తి మరణించగా మరో 14గురు తీవ్రగాయాలకు గురయ్యారు. ప్రభుత్వాధికారులు తక్షణ చర్యలు చేపడుతున్నారు. (కాపు - మాల కులాల మధ్య) |
| 11. | హైదరాబాద్ | కులదూషణ | 24.6.08న నల్లకుంట, లిబర్టీ సమీపంలో జనార్ధన్ అపార్ట్‌మెంట్‌లో 401 ప్లాట్‌లో స్వరూప్‌కుమార్ (దళిత మాదిగ) అనే వ్యక్తి నివసిస్తున్నాడు. అతనిని సునీల్ స్వరూప్ కుమార్ కులం పేరుతో దూషించి, అసభ్య పదజాలంతో దూషించాడు. |
| 12. | నల్గొండ | | 2.7.08న నల్గొండ జిల్లాలోని పలు సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో వసతులు లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు |
| 13. | నల్గొండ | అధికారుల నిర్లక్ష్యం వలన విద్యార్థి మృతి | 22.6.08న యాదగిరిగుట్ట (మం) సాధువెళ్ళి గ్రామానికి చెందిన ఇంజ జలంధర్ (13) రాజాపేట (మం), రఘునాదపురం ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. గత మూడు రోజులుగా తలనొప్పి, ఛాతి నొప్పితో బాధపడుతూ వైద్యసహాయం అందక తన స్వగ్రామానికి కాలినడకన చేరుకుని రోడ్డుపై పడి చనిపోయాడు. |
| 14. | క్రిష్ణా | కులదూషణ దాడి | 27.06.08న పెడన (మం) కట్లపల్లి గ్రామంలో నజీర్ హుస్సేన్‌కు చెందిన పొలంలో కౌలురైతు నవబత్తుల రవికుమార్ అనే దళితుడు పొలం సాగు చేసుకుంటుండగా పెడనకు చెందిన నజీర్ హుస్సేన్ శత్రువులు పొలం సాగుచేయవద్దని అభ్యంతరం చెప్పారు. అందుకు రవికుమార్ నిరాకరించడంతో కులంపేరుతో దూషించి ముకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారు. |

| | | | |
|---|---|---|---|
| 15. | కర్నూలు | అత్యాచార యత్నం దాడి | 14.6.08న ఎ.కొండూరు (మం), కంభంపాడు గ్రామానికి చెందిన కోట యేసు అదే గ్రామానికి చెందిన కాలసాని నరసింహారావుకు చెందిన మామిడి తోటలో కాపలా ఉంటున్నాడు. యధావిధిగా ఈ నెల 14నతన భర్తకు భోజనం తీసుకువెళ్ళిన యేసు భార్యపై నరసింహారావు అత్యాచారయత్నం చేశాడు.అడ్డుకున్న భర్తను కొట్టి గాయపరిచాడు. |
| 16. | మెదక్ | కులదూషణ | దుబ్బాక (మం), చీకోడుకు చెందిన శెల్కల భూంరెడ్డి తన భూమిని దళితుడైన కమ్మరి శ్రీనివాస్‌కు కౌలుకు రాసి ఇచ్చాడు. భూంరెడ్డికి భార్య లక్ష్మికి మద్య ఉన్న కుటుంబ తగాదాల కారణంగా లక్ష్మి ఆమె తండ్రి, కుమారుడు ఆ భూమిలో పంట వేయడంతో పాటు, శ్రీనివాస్‌ను కులంపేరుతో దూషించాడు. |
| 17. | మెదక్ | కులదూషణ | 3.7.08న జహీరాబాద్ (మం) శేఖపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్తయ్యను అదే గ్రామానికి చెందిన మాధవరెడ్డి కులంపేరుతో దూషించి దాడిచేశాడు. |
| 18. | వరంగల్ | కులదూషణ | 21.6.07 రఘునాధపల్లి (మం) దాసన్నగూడెం గ్రామానికి చెందిన ఎంపాల రంగారెడ్డి సోదరుడు లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యుల మధ్య జరిగిన గొడవలో పోచయ్య కలుగుజేసుకోగా, అతనిని కులం పేరుతో దూషించారు. |
| 19. | రంగారెడ్డి | కులదూషణ, దాడి | 6.7.08న గండీడ్ (మం), బల్సూరు గాండ గ్రామంలో దళితుడు హరిజన్ చెన్నప్పను కులంపేరుతో దూషించి అగ్రవర్ణాల వారు దాడిచేశారు. గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని, బాధితులకు సాక్షులకు రక్షణ కల్పించాలని జిల్లా దళిత సంక్షేమ పోరాట సంఘం కోరింది. |
| 20. | రంగారెడ్డి | కులదూషణ దాడి | 20.6.08న శంకరపల్లి రావులపల్లిలో గత నెల చివర్లో బోరు బావికి చెందిన సర్వీస్ వైరు దొంగతనం జరిగింది. ఆ నేరం చేశారని బొజ్జా వెంకటరెడ్డి, నాగార్జున రెడ్డి, మన్నె శ్రీను, కౌకుంట్ల పాండు రంగారావు ఇంకాఇద్దరు కలిసిమెతె. బాల్‌రాజ్, యాదయ్య, గణేష్‌లను కులంపేరుతో దూషించి, చెట్టుకు వేలాడ దీసి కొట్టారని ఫిర్యాదు చేశారు. |
| 21. | మెదక్ | కులదూషణ దాడి | 8.7.08న రాంచంద్రాపురం గత ఎన్నికల్లో వారు చెప్పిన వారికి మెడికల్ పాసులపై సంతకాలు చేయలేదని పేర్కొంటూ ఈ నెల రెండో తేదీన ఐఎన్‌టి యుసి నాయకులు దామోదర్ రెడ్డి రవీందర్ రెడ్డి ఇంకా ముగ్గురు ఖేల్ డిజియం కోటయ్య గదిలోకి ఉదయంపూట వెళ్ళి దాడికి పాల్పడి కులంపేరుతో దూషించారు. వారు గదిలోకి వచ్చిన కొద్దిసేపటికి అధికార యూనియన్ అధ్యక్షుడు ఫోన్ చేసి వచ్చినవారు మా వాళ్ళే వారు చెప్పినట్లు వినకపోతే చంపేస్తానని బెదిరించడమే కాకుండా కులంపేరుతో దూషించారనితెలిపారు. |
| 22. | నల్గొండ | కులదూషణ | 19.7.08న మర్రిగూడ (మం), వట్టిపల్లి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన తప్పరి పద్మ మర్రిగూడ చౌరస్తా వద్ద ఫోటోల కోసం ఫోటో స్టూడియోకి వెళ్ళింది. మానసిక వేధింపుల కారణంగానే తన భర్త మరణించాడని అక్కడ మల్లిరెడ్డి, నర్సిరెడ్డితో గొడవ పడింది. ఈ విషయమై తనను కులంపేరుతో దూషించాడంటూ కేసు పెట్టింది. |
| 23. | హైదరాబాద్ | కిడ్నాప్ | 19.7.08న కుత్బుల్లాపూర్, గాజుల రామారం రోడ్డులో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న ఓ మహిళను సంజీవ (20) చంద్రశేఖర్ (22) అశోక్ (20) సాయిలు (25) బలవంతంగా కిడ్నాప్ చేయాలని ప్రయత్నించగా ఆ మహిళ అరుపులు పెట్టడంతో స్థానికులు ఆటో ఆపి, ఆమెను రక్షించి, నిందితులను పోలీసులకు అప్పగించారు. |
| 24. | గుంటూరు | కులదూషణ | 21.7.08న మాచర్ల టౌన్, డికల రమేస్ బిఎస్పీ అధ్యక్షులు పోలాకృష్ణ మూర్తి కలిసి ఆయనకు బాకి ఉన్న పోలా చిన సత్యనారాయణ శ్రీనివాసరావుల వద్దకు వెళ్ళారు. వారు కృష్ణమూర్తి వెంట వచ్చిన రమేష్‌ను కులం పేరుతో దూషించగా అతను కోర్టులో కేసు వేశాడు. |
| 25. | మహబూబ్‌నగర్ | దాడి | 15.7.08న నాగర్‌కర్నూలు, తాండూరు (మం), గుట్టలపల్లి గ్రామానికి చెందిన బలరాం అనే దళితుడిపై అకారణంగా దాడికి పాల్పడిన అగ్రవర్ణాలకు చెందిన వారిని కఠినంగా శిక్షించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపియస్ డిమాండ్ చేసింది. |
| 26. | కరీంనగర్ | కులదూషణ | 126.7.08న జమ్మికుంట (మం), పాతర్లపల్లి గ్రామానికి చెందిన రాంచక్రపాణి అనే దళిత యువకుని గత నాలుగు రోజుల క్రితం సిరిసేడు గ్రామానికి చెందిన గౌడ కులస్తులు ఉమ్మగాని రమేష్ పి. రాజు అనే ఐదుగురు వ్యక్తులు చక్రపాణి పై దాడిచేసి మాదిగ కులంపేరుతో బూతుమాటలతో దూషించారు. కేసు రిజిష్టరైంది. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. |
| 27. | నిజాంబాద్ | కులదూషణ | 25.7.08న కోటగిరి (మం) కారేగాం, చేతననగర్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులు కాంబ్లే సాయిలు అనే వ్యక్తిని భూ వివాదంలో కులం పేరుతో దూషించారు. ఎస్.సి / ఎస్.టి కేసు నమోదయింది. |
| 28. | విశాఖపట్నం | కులదూషణ | 22.7.08న రావికమతం (మం) కొత్తకోట గ్రామానికి చెందిన గెడ్డం కళ్యాణంను కులంపేరుతో దూషించిన వారిపై కేసు నమోదు చేయాలని దళితుడు కె.చిన్న అప్పారావుపై దాడిచేసిన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. |

| వ. నెం. | స్థలము | నేరం | తేదీ / సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 29. | కడప | కులదూషణ దాడి | 22.7.08న సిద్దవటం (మం) నెకనాపురం గ్రామానికి చెందిన రెడ్డి పోరుల పెంచలయ్య శేషారెడ్డిలు శంకరపల్లి గ్రామంలో జరిగిన జాతర సందర్భంగా ట్రాక్టరులో ఇసుక తీసుకొని వెళుతుండగా, నాగార్జున చలమయ్య సురేష్, బుజ్జి, శివయ్య, శ్రీను మొదలగు వారు ట్రాక్టరును ఆపి ఎక్కేందుకు ప్రయత్నించారు. పెంచలయ్య అడ్డు చెప్పడంతో కులం పేరుతో దూషించి, దాడిచేశారు. నిందితులను అరెస్టు చేశారు. |
| 29. | కడప | కులదూషణ దాడి | 23.7.08న చిన్నచౌక్ పరిధిలోని పకీరు పల్లె వద్ద వల్మూరుకు చెందిన మల్లు, రవి అనే దళితుడి పై భూవివాదంలో దాడి చేసి, కులంపేరుతో దూషించిన పక్కీరు పల్లికి చెందిన వెంకటక్రిష్ణారెడ్డి రామసుబ్బారెడ్డి, లక్ష్మారెడ్డి చిన్న కొండారెడ్డి, రాజశేఖర్ రెడ్డి మొదలైన వారు బాధితుడు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. |
| 30. | శ్రీకాకుళం | కిడ్నాప్ లైంగిక వేధింపులు | 23.7.08న పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూనగర్‌కు చెందిన ఎస్సీ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంతోష్ అతని స్నేహితులు మరో ఆరుగురు. |
| 31. | రంగారెడ్డి | కట్టేసి కొట్టి హత్య | 5.8.08న పెద్దేముల్ మండలం, బుద్దారం గ్రామంలో బ్యాగరి శ్రీనివాస్ (24) 7.8.08 మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి ఇంట్లోకి పై నుంచి దూకి ప్రవేశించి మహిళల వద్దనున్న ఆభరణాలను దొంగిలించే ప్రయత్నం చేశాడు. అలికిడితో లైట్లు వేసి శ్రీనివాస్‌ను స్థంబానికి కట్టేసి చుట్టుప్రక్కలవారికి తెలిపి, అందరూ కలిసి అతనిని కొట్టారు. నాగలి కర్రు కాల్చి శరీరంపై వాతలు పెట్టి, తెల్లవారుజామున అతని తల్లిదండ్రులకు తెలియపర్చారు. తల్లి వేడుకున్నా, అతనని విడిపించకుండా బాలరెడ్డి ఆమె పైన కూడా చేయి చేసుకున్నాడు. తన పెద్ద కుమారుడిని కూడా ఇలాగే చంపారని తల్లి ఆరోపించింది. |


**దళిత, కవులకు, రచయితలకు / రచయిత్రులకు**

**ఆహ్వానం**

**దళిత సాహిత్యం, అంబేడ్కరిజం, మొదలైన అంశాలపై తమ కవితలను, వ్యాసాలను, సాహిత్యాన్ని క్రింద తెలిపిన సాక్షి అడ్రస్‌కి పంపవలసిందిగా ఆహ్వానిస్తున్నాము.**

**సాక్షి**, మానవ హక్కుల నిఘా

**అత్యవసర సమాచారాన్ని అందించడానికి ఉచిత ఫోన్ నెంబరు వినియోగించుకోండి.**

**1800 4255535, 27737093**

**బి.ఎస్.ఎన్.ఎల్. నంబర్ల నుండి ఉచితంగా దళిత కాల్ లైన్‌కు ఫోన్ చేసి, రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న అత్యాచారాల గురించి సాక్షి మానవ హక్కుల నిఘాకు తెలుపవలసింది గా కోరు చున్నాము.**

**సాక్షి**, మానవ హక్కుల నిఘా


మీ అభిప్రాయాలను కింది చిరునామాకు పంపండి.


**సాక్షి** హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.

ఇం.నెం. 10-3-129, IInd ఫ్లోర్, టీచర్స్ కాలనీ, లేన్ నెం. 4, స్ట్రీట్ నెం. 3, ఈస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.

ఫోన్ : 040 - 65440969 ఫ్యాక్స్ : 040 - 27737086

ఇ-మెయిల్ : Sakshi_ap@satyam.net.in వెబ్‌సైట్ : www.sakshiap.org

**Toll Free Dalit Call No - 18004255535, 27737093**



Published by **V. Nanda Gopal,** Director, Sakshi Human Rights Watch, A.P. Secunderabad - 500 026.